మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 21 శనివారం | సెప్టెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 05
Navabhoomi daily fallows..

# తెలంగాణలో ఏపీ సెటిలర్స్ ఫ్రంట్!

- తెలంగాణ సెటిలర్స్ ఫ్రంట్ పేరిట ప్రకటనలు
- ఈ ఫ్రంట్ వెనుక ఎవరున్నారో అంటూ ఆరాలు
- తెలంగాణ ఉద్యమాన్ని తిరిగి రగిల్చే ప్రయత్నం
- దీని వెనుక బీఆర్ఎస్ ఉందంటూ పుకార్లు
- తెలంగాణ సెంటిమెంట్ రగల్చడమే ముఖ్య ఉద్దేశ్యమా?

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఉమ్మడి ఏపీ విభజన సందర్భంలో మిగతా తెలంగాణ వ్యాప్తంగా ఇబ్బంది లేకున్నా.. హైదరాబాద్ పైనే పీటముడి పడింది. తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్న సమయంలో ప్రధాన చర్చంతా హైదరాబాద్ మీదనే నడిచేది. తమిళనాడు నుంచి విడిపోయిన సందర్భంలో మద్రాస్ ను.. ఆపై ఉమ్మడి ఏపీ కోసం కర్నూలు రాజధానిని వదు లుకున్నామని.. మన రాజధాని అని భావించి హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టామని ఇక్కడ సెటిలయిన, వ్యాపారాలు చేస్తున్న వారి తరఫున సీమాంధ్ర నాయకులు వాదించేవారు. ఇందులో ప్రజల కంటే సీమాంధ్ర నాయకుల ఆందోళనే ఎక్కువగా కనిపించేంది. మరోవైపు తెలంగాణ ప్రకటన జరిగాక కూడా అనేక అనుమానాలు, ఆందోళనలు. ఇక తెలంగాణ ప్రజల వాదన వేరేలా ఉండేది. ఉమ్మడి ఏపీ ఆవిర్భావం కంటే ముందే హైదరాబాద్ డెవలప్ అయిందని.. 400 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ నగరం ప్రత్యేకంగా ఎవరి ప్రమేయమూ లేకున్నా మరింత డెవలప్ అవుతుందని వ్యాఖ్యానించేవారు. హైదరాబాద్ పైనే పీటముడి ఉమ్మడి ఏపీ విభజన సందర్భంలో మిగతా తెలంగాణ వ్యాప్తంగా ఇబ్బంది లేకున్నా.. హైదరాబాద్ పైనే పీటముడి పడింది. అప్పటి రాజకీయ నాయకులు కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టినవారి ప్రయోజనాలను స్టేక్ హోల్డర్స్ అంటూ తెరపైకి తెచ్చారు. అయితే, హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధానిగా 2014 నాటికి తెలంగాణ సాకారమైంది. ఈ గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగిసింది. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో హైదరాబాద్ లో సెటిలయిన సీమాంధ్రుల విషయమై తీవ్ర చర్చ జరిగింది. ఈ పదేళ్లలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ రాలేదు. కాగా, తెలంగాణ ఉద్యమ సమయంలోనే సీమాంధ్రుల పరిరక్షణ కంటూ కొన్ని సంఘాలు వెలిశాయి. తమ గొంతులు వినిపించాయి. చివరకు అంతా ప్రశాంతంగా ముగిసింది. సర్వేలో సంచలన విషయాలు మరోసారి తెరపైకి పదేళ్లు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ గడువు తీరి.. దాదాపు పదేళ్లు బీ(టీ)ఆర్ఎస్ అధికారం ముగిసిన తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ

# బతుకమ్మ ఉత్సవాల్లో కవిత రీ-ఎంట్రీ?

- లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కొని జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన కవిత
- ప్రస్తుతానికి ఇంటి నుంచి బయటికి రాకపోవడంపై ఆరాలు
- కొద్దిరోజుల్లో కవిత ప్రజాజీవితంలోకి వచ్చే అవకాశం
- బతుకమ్మ ఉత్సవాలను వేదికగా చేసుకునే ఛాన్స్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

కేసీఆర్ రాజకీయ వారసత్వంతో కవిత రాజకీయాల్లో వచ్చారు. రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. కేసీఆర్ రాజకీయ వారసత్వంతో కవిత రాజకీయాల్లో వచ్చారు. రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ముఖ్యంగా నిజామాబాద్ ఎంపీగా గెలిచి అందరి దృష్టిని ఆకర్షించారు. గెలిచిన తరువాత కూడా కేవలం ఒకే పార్లమెంట్ నియోజకవర్గానికి కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగానూ గుర్తింపు సాధించారు. చాలా సందర్భాల్లోనూ రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేశారు. అందుకే.. ఆమెకు రాష్ట్రవ్యాప్తంగానూ అభిమానులు ఉన్నారు. కట్ చేస్తే.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత అరెస్ట్ అయ్యారు. సుమారు 5 నెలలకు పైగా ఆమె జైలులోనే ఉండిపోయారు. దాంతో కవిత ఎప్పుడు జైలు నుంచి విడుదల అవుతారా అని అభిమానులంతా ఎదురుచూశారు. ఇటీవల ఆమె జైలు నుంచి బయటకు వచ్చారు.

# నేరం అంగీకారం?

- రిమాండ్ రిపోర్టులో సంచలనాలు..
- నేరం ఒప్పుకున్న జానీ..
- భార్య ప్రమేయం కూడా!

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

జానీ మాస్టర్ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనను జానీ మాస్టర్ రేప్ చేశాడు, అంటూ ఆయన వద్ద పనిచేసిన ఒక అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక అందులో భాగంగానే జానీ మాస్టర్ ని పోలీసులు గోవాలో అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తీసుకొచ్చారు. హైదరాబాద్ కోర్టులో ప్రొడ్యూస్ చేయగా హైదరాబాద్ కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఇక తాజాగా జానీ మాస్టర్ రిమాండ్ రిపోర్టు వెలుగులోకి వచ్చింది. జానీ మాస్టర్ రిమాండ్

## కావాలనే ఇరికించారు

**నార్సింగి-నవభూమి:** లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను శుక్రవారం నార్సింగి పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో జానీ మాస్టర్ మీడియాతో మాట్లాడారు. కావాలనే కుట్రపూరితంగా తనను ఇరికించారని ఆవేదన చెందారు. కడిగిన ముత్యంలా - మిగతా 2లో

## ఓటుకు నోటు కేసులో రేవంత్‌కు ఊరట



**ఢిల్లీ-నవభూమి:** ఓటుకు నోటు కేసులో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఊరట లభించింది. కేసును వేరే కోర్టుకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. భారాస ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. కేసును బదిలీ చేయాలన్న ఆయన విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ పిటిషన్‌పై విచారణను ముగిం చింది. కేసు విచారణపై విశ్రాంత జడ్జి పర్య వేక్షణకూ అత్యున్నత న్యాయస్థానం నిరాకరిం చింది. భవిష్యత్‌లో - మిగతా 2లో

# సింగరేణి లాభాల బోనస్ రూ.796 కోట్లు

- నికర లాభం రూ.4701 కోట్లు
- ఒక్కో కార్మికుడికి రూ.లక్షా తొంభై వేలు బోనస్
- ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల



2

కొత్తగూడెం సెప్టెంబరు 20 నవభూమి ప్రతినిధి:దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులకు తీపి కబురు తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) సింగరేణి సాధించిన 4701 కోట్ల రూపాయల లాభాలలో సంస్థ వ్యాపార విస్తరణ ప్రణాళికల కోసం రూ. 2,289 కోట్ల కేటాయించారు.

# లడ్డుపై రగడ!

- దిల్లీకి చేరిన తిరుమల లడ్డూ వివాదం..
- చంద్రబాబుకు ఫోన్ చేసి వివరాలు కోరిన నడ్డా
- వెంటనే నివేదిక ఇవ్వాలని అధికారులకు సీఎం ఆదేశం
- తిరుమలలో అపచారం జరిగిందంటూ ప్రపంచవ్యాప్తంగా భక్తుల ఆందోళనలు

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** శ్రీవారి లడ్డూ తయారీలో అపవిత్ర పదార్థాలు వినియోగించిన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. అత్యంత పవిత్రమైన తిరుమలలో జరిగిన ఈ అపచారంపై ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తు తున్న ఆందోళనలు, భక్తుల ఆవేదనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది.

గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో నాణ్యతా లోపాలు, అపవిత్ర పదార్థాల వాడకంపై సీఎం చంద్రబాబు సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారధితో పాటు ఉన్నతాధికారులతో తిరుమల అంశంపై సీఎం సమీక్షించారు. లడ్డూ తయారీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై సాయంత్రంలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని తితిదేఈవోను ముఖ్యమంత్రి ఆదేశించారు. తిరుమల పవిత్రత కాపాడే విషయంలో ఆగమ, వైదిక, ధార్మిక పరిషత్‌లతో చర్చించి చర్యలు తీసుకుంటామని సీఎం ప్రకటించారు. భక్తుల విశ్వాసాలు, ఆలయ సాంప్రదాయాలను కాపాడతామని సీఎం చంద్రబాబు అన్నారు.

**చంద్రబాబుతో మాట్లాడిన కేంద్రమంత్రి నడ్డా..**
తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఆరా తీశారు. ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన నివేదిక ఇవ్వాలని కోరారు.

**తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై సమగ్ర నివేదక ఇవ్వండి:** కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తిరుమల శ్రీవారి మహా ప్రసాదం లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వులు కలిపినట్లు వచ్చిన ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. తాజాగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా

# వైకాపా నేత విద్యాసాగర్ అరెస్ట్

- బాలీవుడ్ నటి కాదంబరి జైత్వానిపై తప్పుడు కేసు పెట్టిన విద్యాసాగర్
- కాదంబరి ఫిర్యాదు మేరకు వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ అరెస్ట్
- పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నించిన విద్యాసాగర్
- సాంకేతిక సహాయంతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



**విజయవాడ-నవభూమిబ్యూరో:** బాలీవుడ్ నటి కాదంబరీ జత్వానీపై తప్పుడు కేసు పెట్టిన వ్యవహారంలో వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ ను పోలీసులు అరెస్టు చేశారు.

జత్వానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక ఆధారాల సాయంతో వేరే రాష్ట్రంలో ఉన్న విద్యాసాగర్‌ను అరెస్టు చేశారు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు విద్యాసాగర్ తన స్నేహితుడి మొబైల్ వినియోగించారు. అయినా, సాంకేతికత సాయంతో నిందితుడిని పట్టుకున్నారు.

ఫోర్జరీ పత్రంతో తనపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేశారని జత్వానీ ఇటీవల ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందులో ఐపీఎస్ అధికారులు సీతారామాంజనేయులు, కాంతి రాణా, విశాల్ గున్ని కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌ను ఏ1గా చేర్చారు. అతనితో పాటు మరికొందరు అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. తప్పుడు ఆధారాలను సృష్టించడం, నేరానికి పాల్పడినట్లు తప్పుడు ఆరోపణలు చేయడం, పత్రాలను ఫోర్జరీ చేయడం, తప్పుడు రికార్డులను తయారు చేయడం, తదితర ఆరోపణలపై ఐపీసీలోని 192, 211, 218, 220, 354 (డి), 467, 420, 469, 471 రెడ్ విత్ 120 (బి), ఐటీ చట్టంలోని 66ఏ సెక్షన్ల కింద కేసు పెట్టిన విషయం తెలిసిందే.

## లడ్డూ వివాదంపై స్పందించిన ఏఆర్ డెయిరీ!

- తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారంటూ స్వయంగా సీఎం చంద్రబాబు ఆరోపణ
- తాము సరఫరా చేసే నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని ఏఆర్ డెయిరీ స్పష్టీకరణ


2

విజయవాడ-నవభూమిబ్యూరో

తిరుపతి లడ్డూ రాజకీయ దుమారం రేపింది. ఆంధ్రప్రదేశ్ లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో.. ప్రసిద్ధి చెందిన తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారని.. పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె మొదలైన వాటినీ ఉపయోగించారంటూ ఆరోపణలు తీవ్ర సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని చంద్రబాబే స్వయంగా మిత్రపక్షాల మీటింగ్ లో చెప్పారు. దీంతో... ఒక్కసారిగా ఈ విషయం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. రాజకీయ దుమారం రేపింది. ఈ సమయంలో... ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ఆలయ వైభవాన్ని పునరుద్ధరిస్తుందని, పవిత్ర ప్రసాదాల నాణ్యతను కొనసాగిస్తుందని లోకేష్ హామీ ఇచ్చారు. ఈ వివాదం తారాస్థాయికి

## లడ్డూ నెయ్యిపై సీఎం వ్యాఖ్యలను సవాల్ చేస్తూ హైకోర్టుకు వైసీపీ

- తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారని.. పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె వాడారని సీఎం ఆరోపణ
- చంద్రబాబు ఆరోపణలపై హైకోర్టు మెట్లెక్కిన వైసీపీ
- సిట్టింగ్ జడ్జి లేదా హైకోర్టు నియమించిన కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కోరిన వైసీపీ



**అమరావతి-నవభూమిబ్యూరో:** తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి వివాదంపై వైసీపీ కోర్టు మెట్లు ఎక్కింది. హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ప్రసాదాల్లో జంతువుల ఫ్యాట్ కలిపారని చంద్రబాబు చేసిన ఆరోపణలపై సిటింగ్ జడ్జి, లేదా హైకోర్టు నియమించిన కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కోరింది.

తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొంది. పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

# జగన్‌కు వరుస షాక్‌లు

- టీడీపీలోకి మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- టీడీపీ ముఖ్య నేతలతో గ్రంధి మంతనాలు
- ఇప్పటికే కార్యకర్తల అభిప్రాయాల సేకరణ
- వైసీపీ కార్యకలాపాలకు,సమావేశాలకు డుమ్మా



**అమరావతి-నవభూమిబ్యూరో:**
మాజీ సీఎం జగన్‌కు వరుసగా షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే నేతల రాజీనామాలతో ఇక్కట్లు పడుతున్న జగన్ కు మరో నేత వైసీపీకి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

భీమవరం వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ఆయన టీడీపీ ముఖ్యనేతలతో మంతనాలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జోరందుకుంది.

అధిష్టానానికి దూరంగా...
ఎన్నికలు అయ్యాక పార్టీ కార్యకలాపాలకు దూరంగా శ్రీనివాస్ దూరంగా ఉంటున్నారు. అన్ని సెట్ అయితే టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమని ఆయన అనుచరుల్లో మాట వినిపిస్తోంది. ఇటీవల జిల్లాలోని నియోజకవర్గ ఇంఛార్జ్ లతో సిఎం జగన్ సమావేశం అయిన సంగతి తెలిసిందే. అయితే ఆ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ డుమ్మా కొట్టారు. 2019 లో సినీ స్టార్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై గెలిచిన తనకు సరైన పదవి ఇవ్వకపోవడంతో అప్పట్లోనే వైసీపీ అధిష్టానంపై శ్రీనివాస్ అలిగారు. పార్టీ మారుతున్నట్లు తెలుసుకున్న అధిష్టాన నేతలు శ్రీనివాస్ ను బుజ్జగించే పనులు పద్దారు.

మరో ఇద్దరు కీలక నేతలు..
జగన్ కు షాక్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను. వైసీపీ కి రాజీనామా చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 22న పవన్ కళ్యాణ్ సమక్షం లో జనసేన చేరనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే తన అనుచరులకు పార్టీ మార్పుపై సమాచారం ఇచ్చారు. ఆర్టీవీ తో అయన ఎక్స్‌క్లూజివ్ గా మాట్లాడుతూ.. తాను పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జనసేన లో చేరాలని నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. రేపు జగ్గయ్యపేట లో నియోజకవర్గ కార్యకర్తల తో సమావేశం కానున్నట్లు తెలిపారు. తన అనుచరులు కూడా జనసేనలో చేరనున్నట్లు పేర్కొన్నారు. కాగా అదే రోజు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి కూడా జనసేన కండువా కప్పుకోనున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## తెలంగాణలో మరో మూడురోజులు వానలే.. హెచ్చరించిన ఐఎండీ



**హైదరాబాద్‌-నవభూమి:** తెలంగాణలో రాగల మూడురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను ఆజరీ చేసింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మలుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, మన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లిలో వర్షాలు కురుస్తాయని చెప్పింది.జయశంకర్ భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం పలుచోట్ల ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇదిలా ఉండగా.. ఇవాళ కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్, ములుగు, కొత్తగూడెం, వికారాబాద్ సహా పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి.





## కాళేశ్వరం కమిషన్ ముందు హాజరైన తెలంగాణ రిసెర్చ్ అధికారులు



**హైదరాబాద్‌-నవభూమి:** తెలంగాణ రిసెర్చ్ అధికారులు కాళేశ్వరం కమిషన్ ముందు హాజరయ్యారు. జాయింట్ డైరెక్టర్ తోపాటు చీఫ్ ఇంజినీర్, ఇతర ఇంజనీర్లు కమిషన్ ముందు హాజరైన వారిలో ఉన్నారు. మూడు బ్యారేజీల కంటే ముందు మోడల్ స్టడీస్ కండక్ట్ చేశారా లేదా..? అని ఈ సందర్భంగా రిసెర్చ్ ఇంజినీర్లను కమిషన్ ప్రశ్నించింది. కన్స్ట్రక్షన్‌కు ముందు, మధ్యలో, తర్వాత కూడా మోడల్స్ నిర్వహించినట్లు రిసెర్చ్ ఇంజినీర్‌లు తెలిపారు.మోడల్ స్టడీస్ పూర్తికాకముందే కన్‌స్ట్రక్షన్ మొదలైనట్లు కమిషన్ ముందు రిసెర్చ్ ఇంజినీర్లు ఒప్పుకున్నారు. మేడిగడ్డతో పాటు ఇతర డ్యామేజ్ జరగడానికి కారణం నీళ్లను స్టోరేజ్ చేయడమేనని కమిషన్ ముందు రిసెర్చ్ ఇంజనీర్లు చెప్పారు. వరద ఎక్కువగా వచ్చినప్పుడు గేట్లను ఎత్తకుండా ఫీల్డ్ అధికారులు నిర్లక్ష్యం వహించారని తెలిపారు. మోడల్ స్టడీస్ తర్వాత బఫెల్ బ్లాక్‌లో మార్పులు, సవరణలు చేయడానికి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని చెప్పారు.బ్యారేజీలు డామేజ్ అవ్వడానికి, మోడల్ స్టడీస్‌కు సంబంధం లేదని రిసెర్చ్ అధికారులు కమిషన్‌కు చెప్పారు. మూడు బ్యారేజీల్లో నీళ్లు నిలువ చేయడానికి ఎవరి ఆదేశాలు ఉన్నాయని..? రిసెర్చ్ ఇంజనీర్లను కాళేశ్వరం కమిషన్ ప్రశ్నించింది. అన్నారం బ్యారేజీ నిర్మాణం చేసే లొకేషన్ మారినట్లు రిసెర్చ్ ఇంజనీర్ల దృష్టిలో ఉందా..? అని అడిగింది. ఈ సందర్భంగా నిబంధనల ప్రకారమే టీఎస్ ఈఆర్‌ఎల్ పని చేసిందని కమిషన్ ముందు ఇంజనీర్లు చెప్పారు.లొకేషన్, సీడీవో అథారిటీ రిపోర్ట్స్ ఆధారంగా రిసెర్చ్ చేశామని అధికారులు పేర్కొన్నారు. మొత్తం మూడు బ్యారేజీల్లో 2016 నుంచి 2023 వరకు మోడల్ స్టడీస్.. రిసెర్చ్ టీమ్ ఆధ్వర్యంలో జరిగినట్లు అధికారులు తెలిపారు. ఒకవైపు నిర్మాణం జరుగుతుండగానే మరొక వైపు రిసెర్చ్ కొనసాగుతుందని ఇంజనీర్‌లు చెప్పారు.

## జీవితం చాలా చిన్నది.. దాన్ని మరింత షార్ట్ చేసుకోకండి: కేటీఆర్





**హైదరాబాద్‌-నవభూమి:** అధిక పని ఒత్తిడితో ‘ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా’ కంపెనీలో పనిచేస్తున్న చార్టెడ్ అకౌంటెంట్ (26) అన్నా సెబాస్టియన్ పెరియాలి మృతి వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్( తన ఎక్స్ అకౌంట్‌లో స్పందించారు. చాలా విషపూరితమైన, నిస్సారమైన పని విధానం వల్ల.. మరో యువ జీవితాన్ని కోల్పోవాల్సి వచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పుణెలో అన్నా సెబాస్టియన్ మృతి .. పనిప్రదేశాల్లో ఉండే వత్తిడిని గుర్తు చేస్తోందన్నారు. తీవ్ర వత్తిడిలో డెడ్‌లైన్ల కోసం పనిచేయడం సరికాదు అని, గౌరవంతో పనిచేయాలని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు నాణ్యమైన జీవితాన్ని ఇవ్వాలంటే.. ప్రస్తుతం చట్టపరమైన సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. దీనితో పాటు అధిక పనిని గొప్పగా చిత్రీకరించే విధానాన్ని నిర్మూలించాలన్నారు. మీ జీవితాలే ముఖ్యమన్న విషయాన్ని కార్పొరేట్ ప్రపంచంలోని యువ మిత్రులు గ్రహించాలని కేటీఆర్ తన ట్వీట్‌లో కోరారు. సంస్మరణ ప్రకటనల కన్నా వేగంగా ఉద్యోగ ప్రకటనలు రిలీజ్ అవుతుంటాయని, కానీ మీ అంతిమ సంస్కారాలకు హాజరయ్యే సమయం మీ బాస్‌లకు ఉండదని కేటీఆర్ పేర్కొన్నారు. మీరు బాధలో ఉన్న సమయంలో.. మీ కుటుంబమే మీతో ఉంటుందని తెలిపారు.

## నేషనల్ పోలీసు అకాడమీలో ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్



**హైదరాబాద్‌-నవభూమి:** హైదరాబాద్ నగరంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీసు అకాడమీలో 76వ ఐపీఎస్ ప్రొబేషనర్ల అవుట్ పరేడ్ జరిగింది. 2023 బ్యాచ్‌కి చెందిన 188 మంది ట్రైనీ ఐపీఎస్‌లు శిక్షణ పూర్తి చేస్తుకున్నారు. వీరిలో 56 మంది మహిళా ఐపీఎస్‌లు ఉన్నారు. 76వ ఆర్‌ఆర్(రెగ్యులర్ రిక్రూట్) ఐపీఎస్ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ హాజరయ్యారు.

శిక్షణ పూర్తి చేసుకున్న 188 మంది ట్రైనీ ఐపీఎస్‌ల్లో ఇంజినీరింగ్ చదివిన వారు 109 మంది, ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు 15 మంది ఉండడం విశేషం. అలాగే, లా (న్యాయ శాస్త్రం) పట్టా పొందిన వారు నలుగురు ఉండగా, ఆర్ట్స్ విభాగంలో డిగ్రీ పొందిన వారు 28 మంది, సైన్స్ విభాగాల్లో డిగ్రీ చేసిన వారు 22 మంది, కామర్స్ విభాగం వారు ఎనిమిది మంది, ఇతర డిగ్రీలు చేసిన వారు ఇద్దరు ఉన్నారు.ఇక, 188 మంది ట్రైనీ ఐపీఎస్‌ల్లో యువత అధికంగా ఉన్నారు. 25 ఏళ్ల లోపు వారు 15 మంది ఉండగా, 25–28 ఏళ్ల లోపు వారు 102 మంది ఉన్నారు. మొత్తం 54 మంది మహిళా ఐపీఎసలు ఉండగా వారిలో 38 మంది అవివాహితలు. అలాగే, 134 మంది పురుషుల్లో 116 మంది అవివాహితులు ఉన్నారు. కాగా, 76వ ఆర్‌ఆర్ (రెగ్యులర్ రిక్రూట్) ఐపీఎస్ బ్యాచ్‌లో 188 మంది భారతీయులు, 19 మంది విదేశీయులు కలిపి మొత్తం 207 మంది ఫేస్–1 బేసిక్ కోర్సులో శిక్షణ పూర్తి చేశారని అకాడమీ డైరెక్టర్ డైరెక్టర్ అమిత్ గార్గ్ తెలిపారు. 19 మంది విదేశీయుల్లో నేపాల్, భూటాన్, మారిషస్, మాల్దీవులకు చెందిన వారు ఉన్నారన్నారు.

# హైదరాబాద్‌లో మండుతున్న ఎండలు




**హైదరాబాద్‌-నవభూమి:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎండలు మండుతున్నాయి. దీంతో ఉష్ణోగ్ర తలు సాధారణ స్థాయి దాటి నమోద వుతుండటంతో నగర వాతావరణం వేసవిని తలపిస్తున్నది. ఉదయం నుంచే భానుడు ప్రతాపాన్ని చూపుతుండటంతో మళ్లీ ఉక్కపోత సమస్య తప్పడం లేదు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 33.6, కనిష్ఠం 22.9 డిగ్రీలు, గాలిలో తేమ 51శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాత్రి సమయాల్లో మరింత ఉక్కపోతగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## లడ్డూ వివాదంపై స్పందించిన

**(1వపేజీ తరువాయి)**చేరుకుంటున్న వేళ ఏఆర్ డెయిరీ స్పందించింది. సర్వేలో సంచలన విషయాలు అవును... తిరుమల లడ్డూ ప్రసాదానికి ఉపయోగించే నెయ్యి విషయంలో తీవ్ర వివాదం జరుగుతున్న వేళ ఏఆర్ డెయిరీ స్పందించింది. ఇందులో భాగంగా... ఈ విషయం జూన్, జూలైలోనే వెలుగులోకి వచ్చిందని తెలిపింది. అయితే తాము సరఫరా చేసే నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని వెల్లడించింది. తాము ప్రస్తిద్ధ ఎన్.ఏ.పీ.ఎల్. ల్యాబ్ లో పరీక్షించి.. అగ్మార్క్ ద్వారా అధికారికంగా ధృవీకరించబడిన తర్వాత మాత్రమే నెయ్యి ట్యాంకర్లను పంపుతున్నట్లు తెలిపింది. అయితే.. కొంతమంది ఈ వ్యవహారాన్ని కావాలనే రాజకీయం చేస్తున్నారని చెప్పుకొచ్చింది. ఇదే సమయంలో తాజాగా విడుదలైన నివేదికలో ఇతర కారణాలనూ ప్రస్థావించినట్లు తెలిపింది.! ఇందులో భాగంగా... తాజాగా విడుదలైన నివేదికలో పశుగ్రాసం లేదా జంతువుల ఔషదం వల్ల కూడా ఇది జరగవచ్చు అని.. ఆ ల్యాబ్ రిపోర్ట్ ను జాగ్రత్తగా చదవాలని తెలిపింది. ఆ రిపోర్ట్ లో ఎక్కడా తమ సంస్థ పేరు లేదని స్పష్టం చేసింది! ఇదే సమయంలో తాజాగా విడుదలైన నివేదికను సవాల్ చేసినట్లు తెలిపింది! మరోపక్క ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలంటూ వైసీపీ హైకోర్టును ఆశ్రయించింది! ఈ మేరకు టీటీడీ మాజీ ఛైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి హైకోర్టులో పిల్ వేశారని అంటున్నారు. వచ్చే బుధవారం ఈ కేసు గురించి హైకోర్టులో విచారణ జరగనుందని తెలుస్తోంది.

## మూసీ వెంబడి నిర్మాణాలపై సర్కారు దృష్టి..

**హైదరాబాద్‌-నవభూమి:** మూసీ వెంబడి నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ఉండేందుకు నిర్మాణాల కూల్చివేతలపై కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే మహానగరంలో విస్తరించి ఉన్న 55 కిలోమీటర్ల వెంబడి, ఇరువైపులా ఉన్న నిర్మాణాలపై మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు ఇరిగేషన్, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంతో సర్వే చేయగా, ఇప్పటివరకు 13వేలకు పైగా నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. లండన్‌లోని థేమ్స్ తరహాలో మూసీని లక్షన్నర కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా ఈ నిర్మాణాల విషయంలో ఏం చేయబోతున్నారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. అయితే ప్రభుత్వం మాత్రం ముందు సంబంధిత నిర్మాణ యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు కసరత్తు మొదలుపెట్టినట్లు తెలిసింది.నోటీసుల్లోనే సంబంధిత నిర్మాణం వివరాలను ఎందుకు కూల్చకూడదు అనే విషయంపై వివరణ ఇచ్చే విధంగా ఫార్మాట్‌ను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం మూసీ వెంబడి ఉన్న నిర్మాణాలను అక్రమ, సక్రమమా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఇప్పటికే ఓ దఫా ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ప్రాథమిక సర్వే చేశారు.

# సింగరేణి లాభాల బోనస్ రూ.796 కోట్లు

**(1వపేజీ తరువాయి)** మిగిలిన 2412 కోట్ల రూపాయలపై 33 శాతాన్ని లాభాల వాటా బోనస్ గా కార్మికులకు చెల్లించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర మంత్రి మండలి సభ్యులతో కలిసి సచివాలయంలో లాభాల బోనస్ ను సీఎం ప్రకటించారు. 33 శాతం వాటా కింద రూ.796 కోట్లను కార్మికులకు లాభాల వాటాగా చెల్లిస్తుండగా ఒక్కొక్క కార్మికుడు సగటున రూ.1,90,000 వరకు అందుకోనున్నాడు. సింగరేణి చరిత్రలో ఇదే అత్యధిక లాభాల వాటా బోనస్ గా నిలువ నుంది. అలాగే సింగరేణి చరిత్రలో తొలిసారిగా సంస్థ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల బోనస్ ను వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. గతం కన్నా 85 కోట్లు అధికం. 2022 -23 ఆర్థిక సంవత్సరంలో లాభాల వాటా కింద ప్రకటించిన 32 శాతంతో రూ.711 కోట్లను కార్మికులకు పంపిణీ చేయగా ఇప్పుడు 33 శాతంతో రూ.796 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ఇది అప్పటి కన్నా 85 కోట్లు అధికం. అప్పుడు కార్మికులు సగటున ఒక లక్ష 70 వేల రూపాయలు లాభాల బోనస్ గా అందుకోగా ఇప్పుడు సగటున ఒక లక్ష 90 వేల రూపాయలు అందుకోబోతున్నారు. గత ఆర్థిక సంవత్సరం సంస్థలో అత్యధికంగా 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపడంతో ఎప్పుడూ లేనంతగా రూ.4701 కోట్ల నికర లాభాలను కంపెనీ ఆర్జించింది. నాడు లాభాల బోనస్ రూ.2782 నేడు దాదాపు 2 లక్షలు

1990 దశకంలో తీవ్ర నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేసి లాభాల బాట పట్టించారు. ఈ నేపథ్యంలో కార్మికులకు లాభాల్లో వాటా ఇచ్చి ప్రోత్సహించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. 1999 -2000 సంవత్సరంలో తొలిసారిగా నాడు వచ్చిన 300 కోట్ల రూపాయల లాభాల్లో 10 శాతం అనగా 30 కోట్లను లాభాల వాటా బోనస్ గా ప్రకటించారు. నాడు కంపెనీలోఉన్న ఒక లక్ష 8 వేల మంది కార్మికులకు ఒక్కొక్కరికి సగటున 2,782 రూపాయలను లాభాల వాటాగా పంపిణీ చేశారు. ఈ సాంప్రదాయం దేశంలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థలోనూ లేదు, నాటి నుంచి సింగరేణి సంస్థ వరుసగా లాభాలు సాధిస్తూ దేశంలోనే అగ్రస్థాయి సంస్థగా నిలుస్తూ వస్తోంది. దీనితో లాభాల వాటా బోనస్ను ప్రతీ ఏడాది పెంచుతూ కార్మికులకు పంపిణీ చేస్తున్నారు. 2013-24లో లాభాల బోనస్ 20 శాతాని కి పెరిగింది. అప్పుడు సగటున కార్మికుడు 13,751 రూపాయలు లాభాల వాట బోనస్ గా స్వీకరించాడు. 2021- 22 నాటికి ఇది 30 శాతానికి చేరుకోగా సగటున కార్మికుడికి సుమారు 90 వేల రూపాయల వరకు లాభాల వాటా అందింది. ఈ ఏడాది సింగరేణి చరిత్ర లోనే అత్యధికంగా 33 శాతం లాభాల వాటా బోనస్ గా ప్రకటించడం వలన మస్టర్లు అధికంగా ఉన్న కార్మికులు 2.5 లక్షలకు పైగా బోనస్ అందుకునే అవకాశం ఉంది. అయితే సగటున మాత్రం 1,90,000 రూపాయలను కార్మికులు అందుకోనున్నారు. తొలిసారిగా పొరుగు సేవల సిబ్బందికి కూడా బోనస్ ఇవ్వనున్నారు. సింగరేణి కాలరీస్ చరిత్రలో తొలిసారిగా ఈ ఏడాది పొరుగు సేవల కింద పని చేస్తున్న కాంట్రాక్టు, ఒప్పంద కార్మికుల కూడా లాభాల బోనస్ను చెల్లించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. కంపెనీలో 25 వేల మంది వరకు కాంట్రాక్టు, పొరుగు సేవల సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో గత ఆర్థిక సంవత్సరంలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేసిన వారికి నిబంధనల ప్రకారం బోనస్ను చెల్లించనున్నారు. సగటున రూ.5 వేల వరకు లాభాల బోనస్ను కాంట్రాక్టు కార్మికులు పొందే అవకాశం ఉంది.

**బహుముఖ వ్యాపార విస్తరణ:–**

ఈ ఏడాది వచ్చిన 4701 కోట్ల రూపాయల లాభాలలో 2289 కోట్ల రూపాయాలను కంపెనీ విస్తరణ , అభివృద్ధి పనుల కోసం కేటాయిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. కంపెనీ ఆర్థిక సుస్థిరత, భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వ మార్గ నిర్దేశంలో బహుముఖ వ్యాపార విస్తరణ చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా సోలార్ విద్యుత్తు 1,000 మెగావాట్లకు పెంచాలని, రామగుండంలో 500 మెగావాట్ల పంప్డుడ్ స్టోరేజీ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని, ప్రస్తుత 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో మరో 800 మెగావాట్ల సామర్థ్యం కల సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, రామగుండంలో తెలంగాణ జెన్కో భాగస్వామ్యంలో 800 మెగావాట్ల ప్లాంట్ను ,ఒడిశాలో 2400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించి ప్రణాళికలను రూపొందించి ముందుకెళ్తున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థలో వీకే ఓసీ, గోలేటి ఓసీ, నైనీ ఓసీలను ఈ ఏడాది ప్రారంభించనున్నట్లు, తద్వారా ఏడాది ఉత్పత్తి లక్ష్యం 72 మిలియన్ టన్నులకు చేరుకోనుందన్నారు. అలాగే నూతన సీహెచ్పీల నిర్మాణం, కార్మికుల సౌకర్యార్థం క్వార్టర్లు, కార్మికుల పిల్లల కోసం సింగరేణి పాఠశాల ఆధునికీకరణ, రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు, ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ, క్యాథ్ ల్యాబ్ల ఏర్పాటు, క్యాంటీన్ల ఆధునికీకరణ, హైదరాబాద్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వ్యాపార విస్తరణ చర్యలతో కంపెనీకి ఉజ్వల భవిష్యత్ ఉందని, కాబట్టి కార్మికులు, అధికారులు సమర్థంగా పనిచేస్తూ రక్షణ, నాణ్యతతో కూడిన ఉత్పత్తికి కృషి చేసి సంస్థను ఆదర్శవంతమైన కంపెనీగా తీర్చిదిద్దాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేంసాగర్ రావు, ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య సంఘ నాయకులు జనక్ ప్రసాద్, అధికారుల సంఘం నాయకులు లక్ష్మీ పతి గౌడ్, జీఎంలు సుభానీ, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు లాభాల వాటా ను ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కి, ఉప ముఖ్యమంత్రి కి కార్మికుల తరఫున సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి సంస్థలో గల 41,500 మంది కార్మికులు, అధికారులకు ఈ బోనస్ ను దసరా పండుగకు ముందు చెల్లించేందు ఏర్పాట్లు చేయాలని ఆయన సిబ్బంది, ఆర్థిక శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

# లడ్డుపై రగడ!

దీనిపై స్పందించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. దిల్లీలో జరిగిన కార్యక్రమంలో నడ్డా మాట్లాడుతూ “నేను ఆయనతో (సీఎం చంద్రబాబు) మాట్లాడాను. వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపించమని చెప్పాను. కేంద్రం ఈ విషయంలో రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్–ఎస్ఏఐ) నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకొంటాం. ఇప్పటికి నివేదికే కోరాం” అని తెలిపారు.తిరుమల ప్రసాదంలో కల్తీపై మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా స్పందించారు. ఇది ఏమాత్రం క్షమించరాని నేరమని ఆయన అభివర్ణించారు. అదే సమయంలో ఈ వ్యవహారంలో మత కోణం ఉంటుందనే అనుమానం వ్యక్తం చేశారు. బోర్డులో అన్యమతస్తుల కారణంగానే కల్తీ నెయ్యి సరఫరా అయిందన్నారు.

**ఇది ప్రజల విశ్వాసంపై దాడి:**తిరుమల ప్రసాదంలో కల్తీపై భాజపా సీనియర్ నేత ముక్తార్ అబ్బాస్ నఖ్వీ స్పందించారు. “ఇది ప్రజల విశ్వాసంపై నేరుగా జరిగిన దాడి. వారి నమ్మకాన్ని వమ్ముచేయడమే. పక్కా ప్రణాళికతో జరిగిన కుట్ర ఇది. కేవలం వ్యాపార ప్రయోజనాల కోసం కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. దీనికి కారకులను కఠినంగా శిక్షించాలి. ఇది ఏమాత్రం క్షమించరాని నేరం” అని వ్యాఖ్యానించారు.

‘వైకాపా ప్రభుత్వంలో హయాంలో అపవిత్రంగా లడ్డూలు తయారు చేశారు. వాటిల్లో వినియోగించిన ముడిసరకులు నాణ్యమైనవి వాడకపోవడం ఒక ఎత్తు.. అపవిత్రమైనవి వాడటం మరో ఎత్తు. తితిదే పరీక్షలు చేయించగా ఈ విషయం నిర్ధారణయింది’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం స్పష్టం చేశారు. తిరుమలలో ఇప్పటికే ఈ విషయంలో మార్పులు చేశామన్నారు. లడ్డూ తయారీలో నాణ్యమైన నెయ్యి వాడుతున్నామని.. దీంతో లడ్డూ నాణ్యత మెరుగుపడిందని చెప్పారు. దీన్ని మరింత మెరుగుపరుస్తామని, తిరుపతిని ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు.

**ఇది చాలా తీవ్రమైన విషయం.. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ**

తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో నాసిరకం వస్తువులతో పాటు జంతువుల కొవ్వు వినియోగించారనే ఆరోపణలతో చెలరేగిన దుమారంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ స్పందించారు.

## తెలంగాణలో ఏపీ సెటిలర్స్ ఫ్రంట్!

**(1వపేజీ తరువాయి)**చేతికి పగ్గాలు వచ్చాయి. బీఆర్ఎస్ తెలంగాణలో తొలిసారిగా ప్రతిపక్షంలోకి వెళ్లింది. ఇక ఇటీవలి పరిణామాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. గాంధీ ఆంధ్రా వ్యక్తి అని అక్కడికే పంపిస్తామంటూ కౌశిక్ మాట్లాడారు. దీంతో బీఆర్ఎస్ మరోసారి తమ సెంటిమెంట్ ఆయుధమైన తెలంగాణవాదాన్ని ఎంచుకుం టోందా? అనే చర్చ మొదలైంది. ఇదే సమయంలో ఓ కీలక ప్రకటన కనిపించింది. తెరవెనుక ఉన్నది ఎవరో? తెలంగాణ ఏపీ సెటిలర్స్ ఫ్రంట్ అంటూ ఇటీవల ప్రధాన మీడియాలో ఓ ప్రకటన కనిపిస్తోంది. దీనికి అడుసుమిల్లి కల్యాణ్ ప్రెసిడెంట్ గా ప్రకటనలో ఉంది. తెలంగాణలో ఏపీ సెటిలర్ల గొంతుక అనేది వీరి ఉద్దేశం. తెలంగాణలో ఉన్న ఏపీ సెటిలర్స్ కుటుంబసభ్యులందరికీ ఫ్రంట్ ఆవిర్భావ శుభాకాంక్షలను తెలుపుతున్నారు. వాస్తవానికి తెలంగాణ, ఏపీ వాదనలు సమసి అంతా ప్రశాంతంగా ఉంది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య కూడా స్నేహపూర్వక సంబంధాలే ఉన్నాయి. ఇలాంటి సమయంలో కౌశిక్ రెడ్డి రాయి వేశారు. దీంతోనే తెలంగాణలో ఏపీ సెటిలర్స్ ఫ్రంట్ ఉనికిలోకి వచ్చిందా? అనే అభిప్రాయం వినిపిస్తోంది. బీఆర్ఎస్ భవిష్యత్ లో మళ్లీ తెలంగాణ వాదం వినిపిస్తే దానికి కౌంటర్ గా ఈ ఫ్రంట్ ను ముందుకుతెచ్చే ఉద్దేశం ఉందా? అనే ఊహాగానాలు వస్తున్నాయి. మరి దీని తెరవెనుక ఉన్నదెవరో?

## నేరం అంగీకారం?

**(1వపేజీ తరువాయి)**రిపోర్ట్ లో కీలకమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. జానీ మాస్టర్ నేరాన్ని అంగీకరించారని రిమాండ్ రిపోర్ట్ లో పోలీసులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే బాధితురాలిని జానీ మాస్టర్ అసిస్టెంట్గా చేర్చుకున్నారని, 2019లోని బాధితురాలతో జానీ మాస్టర్కు పరిచయం ఏర్పడిందని పేర్కొన్నారు.

2020వ సంవత్సరంలో జానీ మాస్టర్ బాధితురాలి మీద లైంగిక దాడి చేశాడని తొలిసారి జానీ మాస్టర్ బాధితురాలు మీద లైంగిక దాడి చేసినప్పుడు ఆమె వయసు పదహారేళ్ళని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇక పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న దాని ప్రకారం నాలుగేళ్లలో బాధితురాలిపై ఎన్నోసార్లు లైంగిక దాడి జరిగినట్లుగా ఉంది. ఈ విషయం బయటికి చెబితే సినిమా అవకాశాలు రాకుండా చేస్తానని కూడా జానీ మాస్టర్ బెదిరించినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. జానీ మాస్టర్ తో పాటు జానీ మాస్టర్ భార్య కూడా ఈ మేరకు బెదిరింపులకు దిగినట్లుగా రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించడం జరిగింది. ఇక ఈ రిమాండ్ రిపోర్టు ప్రకారం చూస్తే జానీ మాస్టర్ కు కఠిన శిక్ష పడే అవకాశం అయితే కనిపిస్తోంది. మొదటిసారి లైంగిక దాడి చేసినప్పుడు బాధితురాలు వయసు 16 సంవత్సరాలు కావడంతో పోస్కో చట్టం కింద కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ చట్టం కింద కఠిన శిక్ష పడే అవకాశం ఉందని న్యాయ విశ్లేషకులు చెబుతున్నారు.

## బతుకమ్మ ఉత్సవాల్లో కవిత రీ-ఎంట్రీ?

**(1వపేజీ తరువాయి)**ఆమె వచ్చి కూడా 20 రోజుల పైనే అవుతోంది. కానీ.. ఇప్పటివరకు ఆమె ప్రజాక్షేత్రంలోకి రాలేదు. కుటుంబసభ్యులతో గడుపుతున్నారు. వచ్చీరాగానే కేసీఆర్‌ను కలుసుకున్న ఆమె.. కొన్ని రోజులపాటు అక్కడే ఉండిపోయారు. అయితే ఇప్పుడు ఆమె అభిమానులంతా కవిత ఎప్పుడు ప్రజల్లోకి వస్తుందా అని చూస్తున్నారు. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే పండుగ బతుకమ్మ. ఈ ఉత్సవాలు రాష్ట్రంలో మరో పది రోజుల్లో ప్రారంభం కాబోతున్నాయి. ఏటా కవిత తెలంగాణ జాగృతి పేరిట బతుకమ్మ ఉత్సవాలను జరుపుతుంటారు. కేవలం రాష్ట్రానికే పరిమితం కాకుండా.. ఇతర దేశాల్లోనూ ఈ పండుగ వైభవాన్ని చాటుతుంటారు. ఈరోజు బతుకమ్మ ఖ్యాతి ఖండాంతరాలకు చేరిందంటే అది కవిత క్రెడిట్ అనే అందరూ చెబుతూ ఉంటారు. ఈ పండుగ వచ్చిందంటే ఎమ్మెల్సీ కవిత చేసే హడావుడి అంతా ఇంతా కాదు. వారం రోజులపాటు నిత్యం ఒక్క చోట బతుకమ్మలను స్వయంగా పేరుస్తూ వేడుకలు నిర్వహిస్తారు. నేటి తరానికి మన సంస్కృతిని చాటుతూ పండుగలా జరుపుతారు. అయితే.. పది రోజుల్లో ప్రారంభంకానున్న బతుకమ్మ ఉత్సవాల్లో ఈసారి కవిత పాల్గొంటారా..? అనే సందిగ్ధం నెలకొంది. జైలు నుంచి వచ్చి ఆమె ఇంతవరకు బయటకు రాలేదు. ఒకవేళ బతుకమ్మ పండుగ వేళ వస్తే కాంగ్రెస్, బీజేపీల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందా..? అనే కోణంలోనూ ఆమె ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఏటా ఘనంగా నిర్వహించి.. ఈ ఏడాది పండుగలో పాల్గొనకుంటే ప్రజల్లో నెగెటివ్ థింక్ వస్తుందనే కోణంలోనూ ఆలోచన చేస్తున్నట్లుగా సమాచారం. అయితే ఆమె అనుచరులు మాత్రం కవిత బతుకమ్మ ఉత్సవాలకు హాజరవుతుందంటూ చెప్పుకొస్తున్నారు.

## కావాలనే ఇరికించారు

**(1వపేజీ తరువాయి)**నిజాయితీగా బయటకు వస్తానని ధీమా వ్యక్తం చేశారు. తనను టార్గెట్ చేసి.. ఇబ్బందులకు గురిచేసిన ఎవరినీ వదలిపెట్టబోను అని.. అందరికీ వడ్డీతో సహా చెల్లిస్తా అని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

కాగా, జానీ మాస్టర్‌ను గోవాలో అరెస్ట్ చేసిన నార్సింగి పోలీసులు.. ఇవాళ తెల్లవారుజామున నాలుగు గంటలకు హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. నగరంలోని రహస్య ప్రదేశంలో అతడిని విచారించారు. అనంతరం ఉప్పరపల్లి కోర్టుల్లో ఆయన్ను హాజరుపరిచారు. అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై అత్యాచారం కేసులో జానీ మాస్టర్ నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే యువతి ఫిర్యాదు ఆధారంగా తొలుత అత్యాచారం, నేరపూరిత బెదిరింపు, దాడి తదితర మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## ఓటుకు నోటు కేసులో రేవంత్‌కు ఊరట

**(1వపేజీ తరువాయి)** సీఎం జోక్యంపై ఆధారాలుంటే కోర్టుకు వెళ్లొచ్చని తెలిపింది.

“స్పష్టమైన ఆధారాలు లేకుండా ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ దాఖలు చేశారు. ట్రయల్ కోర్టు పారదర్శకంగా విచారణ చేపట్టాలి. కేసు విచారణలో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోకూడదు. సీఎం, హోంమంత్రికి ఏసీబీ డీజీ రిపోర్టు చేయనక్కర్లేదు. విచారణ జరుగుతున్న దశలో జోక్యం చేసుకోలేం” అని సుప్రీంకోర్టు పేర్కొంది.

విచారణ సందర్భంగా రేవంత్‌రెడ్డికి సుప్రీంకోర్టు పలు సూచనలు చేసింది. తమ తీర్పులపై అభిప్రాయం చెప్పే హక్కు అందరికీ ఉంటుందని.. ప్రజా జీవితంలో ఉన్నవారు ఆచితూచి మాట్లాడాలని పేర్కొంది. గతంలో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిన సందర్భంగా చేసిన వ్యాఖ్యల విషయంలో రేవంత్‌రెడ్డి చెప్పిన క్షమాపణలను సుప్రీంకోర్టు అంగీకరించింది.

## ముగ్గురిని చంపి తిన్న చిరుత.. మ్యాన్ ఈటర్‌గా మారిందంటూ గ్రామస్తుల ఆందోళన



జైపూర్- అటవీ ప్రాంతం సమీపంలోని గ్రామాల్లో సంచరిస్తున్న చిరుత ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి చంపి తిన్నది. (%ూవశీజూఖతీఱ-ఙఖఎ%) దీంతో అది నరమాంస భక్షకిగా మారిందని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. హైవేను దిగ్బంధించి నిరసన వ్యక్తం చేశారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉండితాల్ గ్రామానికి చెందిన 16 ఏళ్ల కమల మేకలు మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లింది. ఆ బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో గ్రామస్తులు వెతికారు. ఛిద్రమైన ఆమె మృతదేహం మరుసటి రోజు అడవిలో కనిపించింది. అలాగే పొరుగున ఉన్న ఖేడియా నుంచి గ్రామానికి తిరిగి వస్తున్న ఖేమారామ్, అతడి కొడుకుపై చిరుత దాడి చేసింది. బాలుడు పరుగెత్తి పారిపోగా ఆ చిరుత ఖేమారామ్‌ను చంపి తిన్నది.కాగా, ఛాలి గ్రామానికి చెందిన 50 ఏళ్ల మహిళను కూడా చిరుత పులి చంపింది. సెప్టెంబరు 8న ఝడోల్ సమీపంలో ఒక మహిళపై అది దాడి చేసింది. ఈ నేపథ్యంలో ఆ చిరుత నరమాంస భక్షకిగా మారిందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం ఝడోల్, గోగుండ మధ్య రాష్ట్ర రహదారిని దిగ్బంధించి నిరసన వ్యక్తం చేశారు.మరోవైపు మనుషులపై దాడి చేసి చంపుతున్న ఆ చిరుతను బంధించేందుకు అటవీ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. రెండు బృందాలను ఆయా గ్రామాలకు పంపారు. పలు చోట్ల పులి బోనులు ఏర్పాటు చేశారు. అయితే ఆ చిరుత నరమాంస భక్షకిగా మారిందా అన్నది ఇప్పుడే చెప్పలేమని అటవీ శాఖ అధికారి అన్నారు.

## హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల వేడి.. ఆ రాష్ట్ర సర్కారుపై ఖర్గే వ్యంగ్యాస్త్రాలు



**న్యూఢిల్లీ- నవభూమి:** హర్యానాలో అక్టోబర్ 5న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. పోలింగ్ తేదీ దగ్గర పడటంతో అక్కడ ఎన్నికల వేడి రాజుకుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఆ రాష్ట్ర ప్రజలపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హర్యానా ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. అందుకు సంబంధించిన వీడియోను ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. 'నిరుద్యోగం, ద్రవ్యోల్బణం రాకెట్ వేగంతో పెరుగుతున్నాయి. హత్యల్లో, కిడ్నాపింగ్‌లలో హర్యానా సర్కారు నెంబర్ వన్‌గా ఉంది. రైతులకు కనీస మద్దతు ధర లభించలేదు. దానికి బదులుగా వారి కోసం నల్లచట్టాలు వచ్చాయి. హర్యానా ప్రభుత్వం గత పదేళ్లుగా నిద్రపోతోంది. ప్రజలారా మీరు మేల్కొండి..! కాంగ్రెస్ లావో.. హర్యానా బచావో' అని ఖర్గే వీడియోలో పేర్కొన్నారు.తాజాగా కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉచిత వైద్యం 25 లక్షల వరకు పెంచుతూ హామీ ఇచ్చింది. బీజేపీ 10 లక్షల వరకే ఉచిత వైద్యాన్ని అందించనున్నట్లు మేనిఫెస్టోలో తెలిపింది. మహిళలకు నెలకు రూ.2 వేల రూపాయలు అందజేస్తామని కాంగ్రెస్ ప్రకటిస్తే.. బీజేపీ వంద రూపాయలు పెంచి మహిళలకు రూ. 2,100 ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చింది. అదేవిధంగా బీజేపీ యువతకు రెండు లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇచ్చింది.

## లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ జరిపించండి.. అమిత్ షాకు వైఎస్ షర్మిల లేఖ




**న్యూఢిల్లీ- నవభూమి:** తిరుమలలో లడ్డూ వ్యవహారం దేశ వ్యాప్తంగా దుమారం రేపుతోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో తయారయ్యే ఈ లడ్డూలో జంతువుల కొవ్వు కలిపినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లడ్డూ కల్తీ వ్యవహారంపై జగన్ సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు.

## తిరుమల ప్రసాదం వివాదంలో బీజేపీ పాత్ర ఉంటే ప్రజలు క్షమించరు : ప్రమోద్ తివారీ




**న్యూఢిల్లీ- నవభూమి:** తిరుపతి ప్రసాదం లడ్డూల తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వును ఉపయోగిస్తున్నారనే వివాదంపై కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో పంపిణీ చేసే లడ్డూల తయారీలో జంతువుల కొవ్వును వాడుతున్నారని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామి అయిన టీడీపీ ఆరోపిస్తోందని, ఇది దేశ ప్రజల విశ్వాసాలను బీజేపీ వమ్ము చేయడంగా పరిగణించాలని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బీజేపీ, బీజేపీ సర్కార్‌లో టీడీపీ భాగస్వామ్య పక్షాలుగా ఉన్నందున ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని వ్యాఖ్యానించారు. ఈ పాపంలో బీజేపీ పాపం ఉంటే దేశ ప్రజలు ఎన్నటికీ కాషాయ పార్టీని క్షమించరని స్పష్టం చేశారు. కాగా, తిరుమల లడ్డూ తయారిలో కల్తీ జరిగిన మాట వాస్తవమేనని టీటీడీ ఈవో శ్యామలారావు స్పష్టం చేశారు.ల్యాబ్ నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా కల్తీ జరిగినట్టు గుర్తించి సరఫరాదారు నుంచి నెయ్యి కొనుగోలును ఆపివేశామని పేర్కొన్నారు. శుక్రవారం టీటీడీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లడ్డూ కల్తీపై వివరాలను వెల్లడించారు.తిరుమల ఆలయాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారని, అటువంటి చోట కల్తీ జరగడం దారుణమన్నారు. ఏపీలో అధికార మార్పిడి జరిగిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఈవోగా బాధ్యతలు చేపట్టానని పేర్కొన్నారు. లడ్డూ నాణ్యత, ప్రమాణాలు తగ్గాయని భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి తన దృష్టికి తీసుకొచ్చారని వెల్లడించారు.

## రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్‌పై పెద్ద పాము.. భయాందోళన చెందిన ప్రయాణికులు

**డెహ్రాడూన్- నవభూమి:** రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్‌పై పెద్ద పాము కనిపించింది. ఇది చూసి ప్రయాణికులు భయాందోళన చెందారు. ఆ ప్లాట్‌ఫారమ్‌పై పరుగులు తీశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం రిషికేశ్‌లోని యోగనగరి రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలపై ఆరు అడుగుల పొడవైన పాము కనిపించింది. ఆ పాము పాకుతూ ప్లాట్‌ఫారమ్‌పైకి చేరింది.కాగా, ఆ పెద్ద పామును చూసి ఆ ప్లాట్‌ఫారమ్‌పై ఉన్న ప్రయాణికులు భయాందోళన చెందారు. అక్కడి నుంచి దూరంగా పరుగెత్తారు. కొందరు తమ లగేజ్ వదిలేసి పరుగులు తీశారు. ఆ ప్లాట్‌ఫారమ్‌పై పాము ఉన్నట్లు అక్కడున్న వారిని అప్రమత్తం చేశారు. ఈ విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ రైల్వే స్టేషన్‌లో గందరగోళం ఏర్పడింది. ప్లాట్‌ఫారమ్‌పై పెద్ద పాము పాకుతూ వెళ్తున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



# ఆర్మీ అధికారి కాబోయే భార్యను లైంగికంగా వేధించిన పోలీసులు..




**భువనేశ్వర్-నవభూమి:** ఫిర్యాదు కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆర్మీ అధికారి, అతడి కాబోయే భార్య పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారు. ఆర్మీ అధికారిని లాకప్‌లో బంధించారు. కాబోయే భార్యను కొట్టడంతోపాటు లైంగికంగా వేధించారు. ప్రతిఘటించిన ఆ మహిళను అరెస్ట్ చేయగా కోర్టు బెయిల్ ఇచ్చింది. దీంతో బయటకు వచ్చిన ఆమె పోలీసుల లైంగిక వేధింపుల గురించి మీడియాకు వివరించింది. ఈ నేపథ్యంలో ఐదుగురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేశారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఈ సంఘటన జరిగింది.

కోల్‌కతాలోని 22వ సిక్కు రెజిమెంట్‌కు చెందిన ఆర్మీ అధికారి కాబోయే భార్యకు భువనేశ్వర్‌లో రెస్టారెంట్ ఉంది. సెప్టెంబర్ 14న అర్ధరాత్రి తర్వాత రెస్టారెంట్ మూసిన ఆమె, ఆర్మీ అధికారితో కలిసి కారులో ఇంటికి వెళ్తున్నది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వారిని వెంబడించారు. దీంతో వారిద్దరూ భయాందోళన చెందారు. దుండగులపై ఫిర్యాదు చేసేందుకు సమీపంలోని భరత్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.కాగా, సెప్టెంబర్ 15న తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో ఆ పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ సివిల్ డ్రెస్‌లో ఉన్నట్లు ఆ మహిళ మీడియాకు తెలిపింది. తన నుంచి ఫిర్యాదు తీసుకునేందుకు ఆమె నిరాకరించినట్లు చెప్పింది. ఇంతలో పోలీస్ అధికారి, మరి కొందరు పోలీసులు స్టేషన్‌కు చేరుకున్నారని, కాబోయే భర్తను సెల్‌లోకి నెట్టి బంధించారని ఆరోపించింది. అయితే ఆయన ఆర్మీ అధికారి అని, కస్టడీలోకి తీసుకోవడం చట్టవ్యతిరేకమని తాను అన్నట్లు ఆ మహిళ తెలిపింది. దీంతో ఇద్దరు మహిళా పోలీసులు తనపై దాడి చేసినట్లు చెప్పింది. ప్రతిఘటించే క్రమంలో ఒక మహిళా పోలీస్ చేతిని కొరికినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో తన కోట్ జాకెట్‌తో తనను కట్టేసి గదిలో నిర్బంధించారని తెలిపింది. అనంతరం ఒక పోలీస్ అధికారి గదిలోకి వచ్చి తన ఎదపై కొట్టాడని, ప్యాంటు విప్పిన అతడు ప్రైవేట్ పార్ట్‌ను చూపాడని, తన దుస్తులు కూడా బలవంతంగా తొలగించి లైంగికంగా వేధించినట్లు ఆరోపించింది. తనను అరెస్ట్ చేయడంతో బెయిల్‌పై విడుదలైనట్లు మీడియాకు తెలిపింది. పోలీసుల లైంగిక వేధింపుల గురించి వివరించడంతోపాటు శరీరంపై గాయాలను చూపించి బోరున ఏడ్చింది.కాగా, మద్యం సేవించిన ఆ జంట విధుల్లో ఉన్న పోలీసులపై దాడి చేయడంతోపాటు స్టేషన్‌లోని కంప్యూటర్, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారని పోలీసులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆ మహిళను అరెస్ట్ చేయగా సెప్టెంబర్ 18న ఒడిశా హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని చెప్పారు.మరోవైపు ఈ ఘటన గురించి తెలుసుకున్న ఆర్మీ, ఒడిశా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. మహిళపై పోలీసుల దాడి, దుష్ప్రవర్తన తీవ్రతపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మహిళపై దాడికి పాల్పడిన ఐదుగురు పోలీసు అధికారులను తొలుత బదిలీ చేశారు. ఆ తర్వాత వారిని సస్పెండ్ చేశారు. ఆర్మీ అధికారి ఫిర్యాదుతో ఆ పోలీసులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కాగా, జాతీయ మహిళా కమిషన్ కూడా ఈ సంఘటనను సుమోటోగా స్వీకరించింది. మహిళను పోలీసులు లైంగికంగా వేధించడంపై నివేదిక కోరింది. అలాగే ఆ పోలీసులపై అత్యవసరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మరోవైపు ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ కూడా ఈ సంఘటనపై స్పందించారు. చాలా హేయమైన చర్య అని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వంద రోజుల పాలనలో కాషాయ పాలకులు చేసిందేమీ లేదు




**న్యూఢిల్లీ- నవభూమి:** మోదీ ప్రభుత్వం వరుసగా మూడోసారి కేంద్రంలో కొలువుతీరిన తొలి వంద రోజుల పాలనలో చేసిందేమీ లేదని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ అన్నారు. అన్ని మంత్రిత్వ శాఖలకు తాము 100 రోజుల కార్యాచరణ అజెండా నిర్ధారించుకున్నామని బీజేపీ ఆర్భాటంగా చెబుతూ వచ్చినా వాస్తవానికి చేసింది శూన్యమని మండిపడ్డారు. సచిన్ పైలట్ శుక్రవారం రాజస్థాన్‌లోని టాంక్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.రాజ్యాంగ పదవిలో ఉన్న లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని బెదిరిస్తున్న నేతలను కూడా కాషాయ పాలకులు వారించకపోవడం వారి స్వభావాన్ని, ఆలోచనా ధోరణిని ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు.

తొలి వంద రోజుల్లో వారు లేటరల్ ఎంట్రీ, వక్ఫ్ సవరణ బిల్లు చేపట్టినా రెండింటిపై యూటర్న్ తీసుకున్నారని అన్నారు. జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ నేపథ్యంలో ప్రజల దృష్టి మరల్చేందుకు జమిలి ఎన్నికలకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ అనే వార్తలను తెరపైకి తెచ్చారని, ఈ నిర్ణయంపైనా కేంద్ర ప్రభుత్వం యూటర్న్ తీసుకుంటుందని అన్నారుఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినా ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఉత్తరాది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాస్తవ అంశాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చారని అంతకుముందు పైలట్ ఆరోపించారు.ఎన్నో అంశాలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉన్నా పార్లమెంట్‌లో తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో యూటర్న్ తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థలో జమిలి ఎన్నికలు సాధ్యమయ్యే పని కాదని, క్యాబినెట్‌లో ఆమోదించినంత మాత్రాన అమలు అంత సులభం కాదని వ్యాఖ్యానించారు. వీరు గత నిర్ణయాలపై యూటర్న్ తీసుకున్న తరహాలోనే జమిలి ఎన్నికలపైనా యూటర్న్ తీసుకుంటారని అన్నారు.జమ్ము కశ్మీర్‌లో తొలి దశ పోలింగ్‌లో బీజేపీ పూర్తిగా వెనుకబడిందని, హరియాణలో సైతం కాషాయ పార్టీది ఇదే పరిస్థితని పేర్కొన్నారు.


## అక్టోబర్ 27న విజయ్ దళపతి పార్టీ తొలి సమావేశం.. అదే రోజున పార్టీ సింబల్ ఆవిష్కరణ..!



**చెన్నై-నవభూమి:** ప్రముఖ కోలీవుడ్ నటుడు దళపతి విజయ్ రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉన్న నటుడు.. త్వరలోనే షూటింగ్స్‌ని పూర్తి చేసి పూర్తిగా రాజకీయాల్లోకి రానున్నారు. ఈ క్రమంలో ఆయన పార్టీకి సంబంధించి తొలి సమావేశం, పార్టీ సింబల్‌కు సంబంధించిన వివరాలపై కీలక ప్రకటన చేశారు. పార్టీ తొలి రాష్ట్ర సదస్సు అక్టోబర్ 27న విల్లుపురం జిల్లాలో నిర్వహించనున్నట్లు తమిళగ వెట్రి కళగం (%ఖఎఅఓష్ణుస్త్రు ఎవీతీఱ ఖఓష్ణుస్త్రుఎ%) దళపతి విజయ్ తెలిపారు. అదే సమావేశంలో పార్టీ గుర్తును సైతం ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని సలై గ్రామంలో సదస్సు జరుగుతుందని విజయ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆ రోజున పార్టీ కార్యాచరణ ప్రణాళిక సైతం వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. విజయ్ ఫిబ్రవరిలో రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం విధితమే, ఇటీవల ఎన్నికల సంఘం వద్ద పార్టీని పేరును నమోదు చేశారు. ఈ నెల 17న ద్రవిడ ఉద్యమ ప్రముఖుడు పెరియార్ ఈవీ రామస్వామికి విజయ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎంకే పార్టీ వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురైపై ప్రశంసలు కురిపించారు. తమిళగ వెట్రి కళగం ద్రవిడ భావజాలానికి కట్టుబడి విజయ్ పేర్కొన్నారు. పెరియార్, ఈవీఆర్‌ను అనుసరించకుండా తమిళనాడులో ఎవరూ రాజకీయాలు చేయలేరని వ్యాఖ్యానించారు.

# తిరుమల లడ్డూ కల్తీపై నివేదిక ఇవ్వండి.. ఏపీ ప్రభుత్వాన్ని కోరిన కేంద్ర ఆరోగ్య శాఖ



**తిరుమల-నవభూమి:** ప్రసాదంలో కల్తీ జరిగిందన్న వార్తలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లడ్డూ కల్తీ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరింది.

లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిందిగా కోరినట్లు వివరించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ అంశంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

లడ్డూపై వివాదంకాగా, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం ఇప్పుడు దుమారం రేపుతున్నది. వైసీపీ హయాంలో లడ్డూ తయారీ కోసం జంతు కొవ్వు వినియోగించారని ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. లడ్డూ కోసం ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్టు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆఫ్ గుజరాత్ (ఎన్‌డీడీబీజీ) సీఏఎల్ఎఫ్ ల్యాబ్ కూడా నిర్ధారించింది. ఈ ఏడాది జూలైలో లడ్డూను ల్యాబ్‌కు పంపగా, అదే నెల 17న నివేదిక వచ్చింది. ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం.. లడ్డూలో ఆవు నెయ్యి, సో యాబీన్, పొద్దు తిరుగుడు, ఆలివ్, గోధుమ బీన్, మకజొన్న, పత్తి గింజలతోపాటు చేపనూనె, జంతు కొవ్వు, పామాయిల్, పంది కొవ్వు కూడా వాడారు. ఆ రిపోర్టును గురువారం టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి మీడియాకు విడుదల చేశారు.

జగన్‌పై ఫిర్యాదు..

ఇక ఈ అంశంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హిందువుల ఆత్మను హత్య చేశారని వినీత్ జిందాల్ మండిపడ్డారు. హిందువుల నమ్మకాలను, విశ్వాసాలను, ఆలయం పవిత్రతను దారుణంగా దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా, కావాలనే ఇలాంటి చర్యలకు జగన్ మోహన్ రెడ్డి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ క్రమంలోనే జగన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.

ఈ వ్యవహారంపై కేంద్ర హోం శాఖతో పాటు ఏపీ, ఉత్తరప్రదేశ్ డీజీపీలకు న్యాయవాది వినీత్ జిందాల్ ఫిర్యాదు చేశారు. జగన్‌తో పాటు అప్పటి టీటీడీ పాలకవర్గం, జంతువుల కొవ్వు నెయ్యిని సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారత న్యాయ సంహితలోని 152, 192, 196, 298, 358 సెక్షన్ల కింద వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, జాతీయ భద్రతా చట్టం కింద కూడా జగన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## స్టార్ హెల్త్ కస్టమర్ల ప్రైవేట్ డేటా లీక్.. టెలిగ్రామ్‌లో అమ్మకానికి




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ అయిన 'స్టార్ హెల్త్' కంపెనీ నుంచి కస్టమర్ల డేటా భారీ స్థాయిలో లీక్ కావడం చర్చనీయాంశంగా మారింది. లక్షలాది కస్టమర్ల సమాచారాన్ని బహిరంగంగా విక్రయానికి ఉంచినట్లు సమాచారం. ఇందులో కస్టమర్ల మెడికల్ రిపోర్టులు, సున్నితమైన సమాచారం కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. టెలిగ్రామ్‌లోని చాట్‌బాట్స్ ద్వారా స్టార్ హెల్త్ సమాచారం అందుబాటులో ఉన్నట్లు తెలిసింది.

ఒక సెక్యూరిటీ రీసెర్చర్ ద్వారా చాట్‌బాట్ సృష్టికర్త ఈ విషయం మీడియాకు తెలియజేయడంతో, మిలియన్ల మంది కస్టమర్ల వ్యక్తిగత సమాచారాన్ని విక్రయానికి ఉంచినట్లు వెల్లడైంది. చాట్‌బాట్‌లను అడగడం ద్వారా వినియోగదారుల సమాచారాన్ని పొందవచ్చని ఆయన వివరించాడు. ఈ యాప్‌లో నేరాలకు అనుమతిస్తున్నట్లు టెలిగ్రామ్ వ్యవస్థాపకుడిపై ఆరోపణలు వచ్చిన కొద్ది రోజుల్లోనే తాజా వ్యవహారం వెలుగుచూడటం గమనార్హం.డేటా చోరీపై స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్స్యూరెన్స్ సంస్థ స్పందించింది. అనధికార డేటా యాక్సెస్‌కు సంబంధించి స్థానిక అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపింది. ఈ విషయంలో రాజీ లేదని.. సున్నితమైన కస్టమర్ల డేటా సురక్షితంగా ఉంటుందని స్పష్టంచేసింది.

### ఐఫోన్ ప్రియులకు శుభవార్త.. బ్లింకిట్, బిగ్ బాస్కెట్‌లో యాపిల్ 16 సిరీస్ సేల్స్.. 10 నిమిషాల్లోనే డెలివరీ

**న్యూఢిల్లీ-నవభూమి:** వినియోగదారులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న యాపిల్ ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లు భారత్ లో అందుబాటులోకి వచ్చేశాయి. ఈ ఫోన్ అమ్మకాలు శుక్రవారం ఉదయం నుంచే ప్రారంభమయ్యాయి. దీంతో ఐఫోన్ 16 సిరీస్ ఫోన్ల కోసం వినియోగదారులు ఢిల్లీ, ముంబైలోని యాపిల్ రిటైల్ స్టోర్ల ముందు క్యూ కట్టారు. తెల్లవారుజాము నుంచే ఈ ఫోన్‌ను దక్కించుకునేందుకు పడిగాపులు కాస్తున్నారు. దీంతో ఆయా స్టోర్ల వద్ద భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఐఫోన్ ప్రియులకు ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లు శుభవార్త చెప్పాయి. గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా.. పది నిమిషాల్లోనే ఈ ఫోన్లను కస్టమర్ల వద్దకు చేర్చేందుకు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా టాటా యాజమాన్యం ఆధీనంలోని బిగ్ బాస్కెట్ కేవలం 10 నిమిషాల్లోనే సరికొత్త ఐఫోన్ 16 సిరీస్‌ను డెలివరి చేస్తామని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

## మహిళా నాయకురాలిపై దాడి.. మెడలో చెప్పులు వేసి ఉరేగింపు



**న్యూఢిల్లీ- నవభూమి:** మహిళా నాయకురాలిపై ఆ పార్టీకి చెందిన నేత తన మద్దతుదారులతో కలిసి దాడి చేశాడు. మెడలో చెప్పుల దండ వేసి ఉరేగించాడు. తీవ్రంగా గాయపడిన ఆ మహిళ ఆసుపత్రిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ నేతను అరెస్ట్ చేశారు. ) బీహార్‌లో అధికారంలో ఉన్న సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూలో ఈ సంఘటన జరిగింది. సీతామర్హి జిల్లాలోని బైర్గానియా బ్లాక్‌లో బుధవారం జేడీయూ కార్యక్రమం జరిగింది. అయితే ఆ పార్టీ మహిళా సెల్ జిల్లా అధ్యక్షురాలు కామిని పటేల్‌ను దీనికి ఆహ్వానించలేదు. ఈ నేపథ్యంలో ఆమెతో పాటు మరికొందరు ఫేస్‌బుక్‌లో కామెంట్లు చేశారు.

కాగా, గురువారం ఉదయం ఈ అంశంపై చర్చించేందుకు వార్డు కౌన్సిలర్ సంజయ్ సింగ్ ఇంటికి కామిని పటేల్ వెళ్లింది. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో వార్డు కౌన్సిలర్ మద్దతుదారులు కామినిని చుట్టుముట్టి కొట్టారు. ఆమెను దొంగగా ఆరోపించారు. మెడలో చెప్పుల దండ వేసి వార్డు కౌన్సిలర్ నివసించే వీధిలో ఊరేగించారు.మరోవైపు అపస్మారక స్థితిలో ఉన్న కామిని పటేల్‌ను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం ముజఫర్‌పూర్‌లోని ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి రిఫర్ చేశారు. కాగా, కామిని పటేల్ ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. జేడీయూ నేత, వార్డు కౌన్సిలర్ సంజయ్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే జేడీయూ మహిళా నాయకురాలిని కొట్టి, మెడలో చెప్పుల దండ వేసి ఆమెను ఊరేగించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ | శనివారం | 21 । సెప్టెంబర్ । 2024



## దేశానికి సైబర్ క్రైమ్ పెను సవాల్‌గా మారింది : కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ- నవభూమి:** సైబర్ క్రైమ్ దేశానికి పెను సవాల్‌గా మారిందని కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ అన్నారు. హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో 76వ బ్యాచ్ ఐపీఎస్ పాసింగ్ ఔట్ పెరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐపీఎస్‌ల గౌరవవందనాన్ని కేంద్రమంత్రి స్వీకరించారు. అనంతరం ఆయన శిక్షణ పూర్తి చేసుకున్న ట్రెయినీ ఐపీఎస్ లకు అభినందనలు తెలియజేశారు. కఠిన శిక్షణ పూర్తి చేసుకుని దేశ సేవ చేయడానికి వెళ్తున్న ఐపీఎస్‌లు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ పోలీసింగ్ భవిష్యత్ కొత్త ఐపీఎస్ అధికారులపై ఆధారపడి ఉందన్నారు. ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తుల పట్ల అధికారులు కఠినంగా ఉండాలని సూచించారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీతో అప్డేట్ అవుతూ ఉండాలని చెప్పారు. పెరుగుతున్న సైబర్ క్రైమ్‌ను కట్టడి చేయడానికి కృషి చేయాలన్నారు. సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్స్ ద్వారా కేసులను తొందరగా పరిష్కరించాలని, నేరస్తులను పట్టుకొని వారికి తొందరగా శిక్షలు పడేలా చూడాలని సూచించారు. కొత్త క్రిమినల్ చట్టాలపట్ల పోలీస్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కేంద్రమంత్రి చెప్పారు. కొవిడ్ టైమ్‌లో పోలీసుల సేవ గొప్పదని కొనియాడారు. భారత పోలీస్ సేవను అత్యున్నత స్థానంలో నిలబెడతారనే నమ్మకముందని అన్నారు. కాగా, 76వ బ్యాచ్ ఐపీఎస్ పాసింగ్ ఔట్ పెరేడ్ ఘనంగా జరిగింది.



## ప్రాంతీయ అస్తిత్వానికి ప్రమాదం

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' వినడానికి నినాదం బాగుంటుంది. చెప్పుకోవడానికి కూడా కొన్ని మంచి మార్పులు కనిపిస్తాయి. సువిశాల భారతదేశంలో ఎప్పుడూ ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. ఎన్నికలు జరిగినప్పుడు కోడ్ అమల్లో ఉంటుంది కాబట్టి అక్కడ పనులు నిలిచిపోతాయి. అలా కాకుండా పంచాయతీలకు మొదలుకొని అసెంబ్లీకి, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు జరిగితే ఓ రెండు నెలల్లో కోడ్ ముచ్చట ముగిసి దేశం అభివృద్ధి పథంలో దూసుకువెళ్లడానికి దేశమంతా ఒకేసారి జరిగే ఎన్నికలు ఇదొక కోణం.ఎప్పుడూ దేశంలో ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరగడం, ప్రచారం, రాజకీయ విమర్శలు, ఆరోపణలతో అభివృద్ధి నిలిచిపోతుందనే వాదన నిజమే. కానీ, ఒకేసారి ఎన్నికల వల్ల రాష్ట్రాలు తమ ప్రాధాన్యాన్ని కోల్పోతాయి. ఇది సమాఖ్య దేశం. భిన్న మతాలు, భిన్న భాషలు, భిన్న సంస్కృతులతో భిన్నత్వంలోనే ఏకత్వంతో సాగుతున్న దేశం. గతంలో జరిగిన ఎన్నికల పరిణామాలను బట్టి చూస్తే ఒకేసారి రాష్ట్ర శాసనసభకు, పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించడం వల్ల రాష్ట్రాలు తమ అస్తి త్వాన్ని కోల్పోతాయి. కులాలు, ప్రాంతా లు, భాష పేరుతో కాకుండా హిందూత్వ పేరుతో దేశం ఏకంగా ఉండాలని బీజేపీ కోరుకుంటున్నది. హిందూత్వ ఓటు బ్యాంకు ద్వారా శాశ్వతంగా అధికారంలో ఉండాలనేది బీజేపీ లక్ష్యం. ఒకే దేశం-ఒకే ఎన్నిక, ఒకే భాష నినాదాలు బీజేపీకి రాజకీయంగా ప్రయోజనం కలిగించేవి.అదే సమయంలో రాష్ట్రాలు ప్రత్యేకత కోల్పోయే ప్రమాదం ఉన్నది. బీజేపీ, మిత్రపక్షాల మద్దతుతో మెజారిటీ సాధించినందున తాను కోరుకున్నది బీజేపీ అమలుచేస్తున్నది. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రంలో ఫ్రంట్ రాజకీయాలు జోరుగా సాగేవి. బాబు ముఖ్యమంత్రిగా కేంద్రం లో చక్రం తిప్పేవారు. రాష్ట్రాలు బలంగా ఉండి, కేంద్రం బలహీనంగా ఉండాలని వాదించేవారు.ఇప్పుడు బీజేపీ కూటమి లో ఉన్న బాబు రాష్ట్రాలను బలహీనపరి చి కేంద్రాన్ని మరింత బలంగా తయారుచేసే ఒకే దేశం ఒకే ఎన్నికలను సమర్థిస్తున్నారు. వేదాంత కంపెనీ మహారాష్ట్రలో రూ.లక్ష కోట్ల పెట్టుబడి గల సెమీ కండక్ట ర్ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన తర్వాత కూడా మోదీ ప్రభుత్వం దాన్ని గుజరాత్ కు తరలించింది. మహారాష్ట్రలో బీజేపీ కూటమే అధికారంలో ఉన్నది. అయినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. ఆయా రాష్ట్రాల్లో తమ పార్టీ గెలవాలనే ఉద్దేశంతో కనీసం ఎన్నికల సమయంలోనైనా రాష్ట్రాలకు కొన్ని వరాలు ప్రకటించేవారు.ఒకేసారి ఎన్నిక వల్ల ఇక అలాంటి వరాలపై ఆశలు పెట్టుకోవలసిన అవసరం లేదు. పార్లమెంట్ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికలకు ప్రజలు భిన్నంగా స్పందిస్తారు. పార్లమెంట్ ఎన్నికలను దేశం కోణంలో చూస్తే అసెంబ్లీ ఎన్నికలను తమ రాష్ట్ర ప్రయోజనాల కోణంలో చూస్తారు. ఏడాదిన్నర కిందట ఎన్నికలు జరిగిన కర్ణాటక లో అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలో ఉన్న బీజేపీ ఘోరంగా ఓడిపోయింది. రాష్ట్రం లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆరు నెలల తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ దెబ్బతిని బీజేపీ విజయం సాధించింది.తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎన్నికలైనా, అసెంబ్లీ ఎన్నికలైనా తమ రాష్ట్రం తమకు ముఖ్యమని భావిస్తారు. పార్లమెంట్, అసెంబ్లీ ఏ ఎన్నికలైనా తమిళనాడులో తమిళ పార్టీల హవానే కానీ, జాతీయ పార్టీల హవా కనిపించదు. మిగిలిన రాష్ట్రా ల్లో అసెంబ్లీ ఎన్నికలకు ఒక తీరుగా, పార్లమెంట్ ఎన్నికలకు మరోవిధంగా ఓటర్లు స్పందించారు. పార్లమెంట్ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు భిన్నంగా స్పం దిస్తారు, రెండూ ఒకేసారి వచ్చినప్పుడు తమకు నష్టం కలిగిందనే ఉద్దేశంతో 2004లో ఉమ్మడి రాష్ట్రంలో బాబు అసెం బ్లీ రద్దుచేసి ముందస్తుకు వెళ్లాలని చూశారు.అసెంబ్లీ రద్దు నిర్ణయాన్ని సచివాలయంలో ఒకవైపు బాబు మీడియాకు వివరిస్తుండగానే ఢిల్లీలో ఎన్నికల కమిషన్ 'ఉమ్మడి రాష్ట్ర ఎన్నికలు ఇప్పుడు నిర్వహించం. పార్లమెంట్ ఎన్నికలతో పాటే నిర్వహిస్తాం' అని ప్రకటించింది. ఆ ఎన్నికల్లో కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచింది. బాబు పార్టీ ఓడిపోయింది. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూటమిలో ఉండటం వల్ల ఒకేసారి ఎన్నికలు జరగడం తమకు మేలే అని టీడీపీ భావిస్తూ ఉండవచ్చు.ఇదేవిధంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వేర్వేరుగా జరిగితే తమకు ప్రయోజనం అని గతంలో టీఆర్ఎస్ ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. 2018లో ఈ నిర్ణయం టీఆర్ఎస్‌కు కలిసివచ్చింది కూడా.బీజేపీ, దాని మిత్రపక్షాలు జమిలి ఎన్నికలను స్వాగతిస్తుండగా బీజేపీ వ్యతిరేకపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. గతంలో బీహార్ రాష్ట్ర ఎన్నికల్లో ఆ రాష్ట్రానికి లక్ష కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మోదీ ప్రకటించా రు. హామీని అమలుచేసినా, చేయకపోయినా పార్లమెంట్‌కు, అసెంబ్లీకి విడివిడి గా ఎన్నికలు జరిగినప్పుడు రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ప్యాకేజీలు, వరాలు ప్రకటించాల్సి ఉంటుంది.

# ఈ అపోహ మరణాలు ఆగేదెప్పుడు ???



చంద్రుని మీదకు రోవర్ పంపించిన దేశం మనది. డెబ్భై నాలుగు శాతం అక్షరాస్యతను కలిగి ఉన్నాం. కోవిడ్ వ్యాధికి స్వదేశీ టీకా కనిపెట్టాం. శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధించాం. అయినా గానీ సమాజంలో చేతబడి లేదా క్షుద్రపూజలు చేస్తున్నారనే నెపంతో జరుగుతున్న దాడులను, హత్యలను మాత్రం ఆపలేకపోతున్నాం. ఈ మూఢనమ్మకాలతో ప్రతీ రోజు ఎక్కడో ఒక దగ్గర అకృత్యాలు జరుగుతూనే ఉన్నాయి.

**పెనుభూతమే అనుమానమై..!**

నిన్న కాక మొన్న సెప్టెంబర్ 15 నాడు "చేతబడి" చేస్తున్నారనే అనుమానంతో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోని గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులను ఆ గ్రామంలో కొందరు కొట్టి చంపారు. ఇదే రాష్ట్రంలోని బలోదబజార్ భటపరా జిల్లాలో బాణామతి ప్రయోగించారనే మూఢనమ్మకంతో 11 నెలల బాలుడితో సహా నలుగురు సభ్యులు హత్యకు గురయ్యారు.

**ఇది ఒక అపోహ మాత్రమే :**

కొన్ని గ్రామాలలో ఎక్కువ సంఖ్యలో మరణాలు, పంట వైఫల్యం, పశువుల నష్టం, కుటుంబ సభ్యుల ఆకస్మికమరణం, అనారోగ్యం వంటి వాటికి కొందరి "చేతబడి" కారణమనే అనుమానంతో కొందరిపై మంత్రగాలని, వారు క్షుద్రపూజలు చేస్తారని ముద్ర వేస్తారు. నిజానికి ఇవి వాస్తవాలు కావు. ఈ సంఘటనలకు వేరే కారణాలు ఉంటాయి. ఈ యేడాది జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్సిఆర్బి) విడుదలచేసిన నివేదికలో 2022 సం.లో క్షుద్రవిద్యలు కలిగి ఉన్నారనో లేదా చేతబడి చేస్తున్నారనో ఒక మూఢనమ్మకంతో దేశ వ్యాప్తంగా 85 హత్యలు నమోదయ్యాయి. ఇటువంటి మరణాలు 25 నమోదుచేసి ఛత్తీస్‌గఢ్ మొదటి స్థానంలో ఉంది. మధ్యప్రదేశ్ లో 20, జార?ండులో



11, ఆంధ్రప్రదేశ్ లో 8, మహారాష్ట్రలో 3, తెలంగాణ, అస్సాం, కేరళలలో చెరో ఒకటి ఇటువంటి హత్యలు జరిగాయి. దేశం మొత్తంమీద ఈ కారణాలతో 2015 నుండి 2021 వరకు ఏడాదికి సగటున 95 హత్యలతో మొత్తం 663 మంది ఈ మూఢనమ్మకానికి బలయ్యారు. మరణాలలో ఝార?ండ్ 19.45, ఒడిషా 14.03, ఛత్తీస్‌గఢ్ 14.93, మధ్యప్రదేశ్ 17.04 శాతాలతో మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. 2021లో ఆరు మరణాలు నరబలితో ముడిపడటం చాలా దురదృష్టకరమైన విషయం.

**ఉమ్మడి చట్టం లేదు :**

మనదేశంలో మంత్రవిద్య, క్షుద్ర ప్రేరేపిత నేరాలపై ప్రత్యేకంగా వ్యవహరించే కేంద్రప్రభుత్వ చట్టం ఏదీ లేకపోవడం చాలా విచారించదగ్గ విషయం. 2016లో ఎంపీ రాఘవ్ లఖన్‌పాల్ మంత్రగత్తెలవేట నిరోధక బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినా కూడా ఆమోదం పొందలేదు. దీనికి కారణం అప్పటి పాలకులకే తెలియాలి. ఇటువంటివి నిరోధించడానికి బీహార్ అక్టోబర్ 1999లో ప్రివెన్షన్ ఆఫ్ విచ్(డైన్) ప్రాక్టీసెస్ పేరుతో చట్టాన్ని రూపొందించిన మొదటి రాష్ట్రంగా నిలిచింది. 2005లో ఛత్తీస్‌గఢ్ తోనాహి (మంత్రగత్తె) ప్రతద్న నివారణ చట్టాన్ని, 2013లో ఒడిశా మంత్రగత్తెలవేట నిరోధక బిల్లును, ఇదే ఏడాదిలో మహారాష్ట్ర మూఢనమ్మకాల వ్యతిరేక కార్యకర్త డాక్టర్ నరేంద్ర దభోల్కర్ హత్య తర్వాత మానవబలి ఇతర అమానవీయ చెడు అఘోరీ పద్ధతుల చేతబడి చట్టం, 2015లో రాజస్థాన్ ప్రివెన్షన్ ఆఫ్ విచ్ హంటింగ్ చట్టం, 2018లో అస్సాం విచ్ హంటింగ్ చట్టాలు తెచ్చాయి. కర్నాటకలో అమానవీయ దుష్ట పద్ధతులు చేతబడి నివారణ నిర్మూలన చట్టం జనవరి 2020 నుండి అమలులోకి వచ్చింది.

అట్టడుగు వర్గాలే బలిపశువులు:

దాడులకు లేదా హత్యలకు గురయ్యే వారిలో వృద్ధులు, ఒంటరి మహిళలు, నిమ్న కులానికి చెందినవారు, గిరిజనులు, సామాజికంగా అట్టడుగున ఉన్నవారే అత్యధికులు. బాధితులు రాళ్ళతో కొట్టివేతకు, ఉరితీతకు, సజీవంగా దహానానికి గురవుతున్నారు. స్త్రీలపై లైంగిక హింస, అత్యాచారాలు కూడా జరుగుతున్నాయి. కొంతమంది సామాజిక అవమానాలకు, సంఘ బహిష్కరణలు లోనవుతున్నారు. ఈలాంటి మానసిక వేదనను అనుభవించలేక కొంతమంది ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలూ లేకపోలేదు. 2009లో జార్కండ్‌లోని డియోఘర్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామానికి చెందిన ఐదుగురు మహిళలను నగ్నంగా ఊరేగించి కొట్టి బలవంతంగా మానవ మలం తినేలా చేశారు.

**కారణాలు:**

పేదరికం, మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత, పుకార్లు ప్రచారం, ఆస్తి వివాదాలు వంటివి ప్రధాన కారణాలు. ఇంకా నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడం, పరిశుభ్రత పాటించక పోవడంతో పాటు సరైన సమయంలో వైద్యం అందకపోవడం వలన ఆయా ప్రాంతాల్లో మరణాలు ఎక్కువగా నమోదవుతాయి. ఇటువంటి మరణాలు మంత్రతంత్రాల ఫలితంగా జరుగుతాయనే అపోహపడతారు. మరికొన్ని కారణాలు చూస్తే ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. వ్యక్తిగత కక్షలు, ఒకరి నుండి అక్రమంగా భూమిని కాజేయడానికి, ఆస్తులను లాక్కోవడానికి చిల్లంగి, బాణామతి వంటి క్షుద్ర శక్తులు కలిగి ఉన్నారని ఆరోపణలు చేసి ఊరెళ్లగొట్టడమో, చంపడమో చేసి వారి ఆస్తుని దక్కించుకుంటున్నారు. కొన్ని గ్రామాలలో వితంతువులు, ఒంటరి స్త్రీలపై లైంగికంగా ఆశపడిన వారిలో కొందరు వారి మీద నిందవేసి ఆ గ్రామం నుండి వేరుచేసి వారి కోర్కెలను తీర్చుకోడానికి, పెళ్లయిన స్త్రీలు లైంగిక వాంఛ తీర్చకపోతే వారి భర్తలకు క్షుద్రశక్తులు ఉన్నాయనే నెపంతో చంపి లొంగదీసుకుంటున్నారు.

**పరిష్కారాలు:**

ప్రధానంగా గిరిజన ప్రాంతాలలో ఈ మూఢనమ్మకాలపై చైతన్యం కలిగించాలి. ఎక్కువగా ఇటువంటి హత్యలు జరిగే గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలి. విద్యా, ఆరోగ్యం, వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవాలి. పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టాలి. మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలి. కొంతమంది "భూతవైద్యం" పేరిట చేసే వ్యాపారులను అరెస్టు చేయాలి. సమాజం యొక్క దృక్పథాన్ని మూఢనమ్మకాలపై నమ్మకాన్ని మార్చడానికి అవగాహన పెంచడానికి ఈ సమస్యను విద్యార్థుల పాఠ్యాంశాల్లోకి తేవాలి. కేంద్రం ఉమ్మడి చట్టం తేవాలి. చేతబడి చేస్తున్నారనే నిందపై అమాయకులను హత్యలు చేసే వారిపై కాలయాపన చేయకుండా దోషులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

***జనక మోహన రావు దుంగ***
***8247045230***

# తెలుగు వెలుగుల జాడ మన గురజాడ



***దేశమును ప్రేమించుమన్నా,***
***మంచి అన్నది పెంచుమన్నా,***
***వొట్టి మాటలు కట్టిపెట్టోయ్,***
***గట్టిమేల్ తలపెట్టవోయ్.***
***దేశమంటే మట్టి కాదోయి,***
***దేశమంటే మనుషులోయ్.***

ఈ రచన చదవని లేదా వినని తెలుగు వారు ఉండరు. దీన్ని రచించించిన అభ్యుదయ కవితా పితామహుడు, కవిశేఖర బిరుదాంకితులు, హేతువాది, తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి గురజాడ అప్పారావు గారు విశాఖపట్నం జిల్లా ( ప్రస్తుతం అనకాపల్లి జిల్లా ) లో ఎలమంచిలి దగ్గరలోని రాయవరం గ్రామంలో 21 సెప్టెంబర్ 1862వ సంవత్సరములో వెంకట రామదాసు, కౌసల్యమ్మ దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి విజయనగరం సంస్థానం లో ఉద్యోగం చేసేవారు. తన ప్రాథమిక పాఠశాల విద్యను చీపురుపల్లిలో పూర్తి చేశారు. మిగిలిన విద్యాభ్యాసమంతా విజయనగరంలో కొనసాగింది. 1882 లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. 1884లో ఎఫ్.ఎ పట్టా పొందారు. 1886లో కొంత కాలం డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో హెడ్ క్లర్క్‌గా పనిచేశాడు. తరువాత ఎంఆర్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. 1887లో విజయనగరంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో గురజాడ మాట్లాడారు. 1891 వ సంవత్సరంలో లెక్చరర్ గా పదోన్నతి పొందారు. అతను ఎఫ్.ఎ , బి.ఎ తరగతులకు ఆంగ్ల వ్యాకరణం, సంస్కృత సాహిత్యం, అనువాదం, గ్రీక్, రోమన్ చరిత్రలతో సహా అనేక విషయాలను బోధించేవారు. ఈయన 1906లో, అతని సన్నిహిత మిత్రుడు ఎ వి యన్



కళాశాల, విశాఖపట్నం ప్రిన్సిపాల్ శ్రీనివాస అయ్యంగార్, ఉన్నత పాఠశాలల్లో పాఠ్యాంశాల సంస్కరణలను ప్రోత్సహించడానికి, మాట్లాడే మాండలికాలను పరిచయం చేసే ప్రధాన లక్ష్యంతో ఒక సంఘాన్ని ప్రారంభించారు. 1911లో మద్రాసు యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో నియమించబడ్డాడు. అదే సంవత్సరం గురజాడ అతని స్నేహితులు మాట్లాడే మాండలికాల వాడకాన్ని ప్రోత్సహించడానికి ఆంధ్ర సాహిత్య పరిషత్‌ను ప్రారంభించారు. మరుసటి సంవత్సరం, కలకత్తాలో బంగీయ సాహిత్య పరిషత్ (బెంగాల్ సాహిత్య సంఘం) సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. 1913లో తన ఉద్యోగానికి పదవీ విరమణ చేసిన తరువాత అప్పటి మద్రాసు విశ్వవిద్యాలయం "ఎమిరిటస్ ఫెలో" బిరుదుతో సత్కరించింది.

ముఖ్య రచనలు:

అతను ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేసారు.1892లో సామాజిక సమస్యలుతో భారతీయ భాషలో తొలి ఆధునిక రచనలలో ఒకటైన మొదటి తెలుగు నాటకం కన్యాశుల్కం ఆంధ్ర దేశాన్ని ఒక ఊపు ఉపేసింది. ఈ నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ నాటకంలో అతను సృష్టించిన గిరీశం, మధురవాణి, రామప్ప పంతులు మొదలైన పాత్రలు ప్రఖ్యాతి పొందాయి. ఈ నాటకం దక్షిణ భారతదేశంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలలో పూజారి బ్రాహ్మణులలో సాధారణమైన కన్యాశుల్కం ఆచారాన్ని చిత్రీకరిస్తుంది. ఆ కాలంలో వివాదాస్పదమైన ఈ నాటకం ఇప్పటికీ అత్యంత ప్రజాదరణ పొందిన తెలుగు సాహిత్య రచనలలో ఒకటిగా కొనసాగుతోంది. ఈ నాటకంలో గురజాడ ఉపయోగించిన అనేక వ్యక్తీకరణలు నేటికీ తెలుగులో ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇందులో ప్రజలు మాట్లాడే మాండలికాలను, సమాజంలో ప్రబలంగా ఉన్న ఉర్దూ పదాలను మనం చూడవచ్చు. మరో ముత్యం లాంటి తెలుగు పద్యాల సంకలనం అయిన "ముత్యాల సరాలు" తెలుగు భాషలో ఆధునిక కవిత్వానికి నాంది పలికింది.కవితలు భారతదేశంలోని సాధారణ సామాజిక పరివర్తనను ప్రతిబింబిస్తాయి.

ఇతర రచనలు :

ఆయన తెలుగు, ఆంగ్లం లో కూడా రచనలు చేశారు. ఆంగ్లంలో సారంగదర, చంద్రహస అనే కవితలు, వైస్రాయ్ ఆఫ్ ఇండియాకు విక్టోరియా రాణిని ప్రశంసిస్తూ ఆంగ్లంలో విక్టోరియా ప్రశస్తి అనే పేరుతో పద్యాలు రాశారు. శ్రీరామ విజయం, జార్జి దేవ కారితం అనే సంస్కృత రచనకి, హరిశ్చంద్ర నాటకానికి ఆంగ్లంలో పరిచయం సమీక్ష వ్రాశారు. ఆధునిక శైలిలో మిణుగుర్లు అనే పిల్లల కథ, కొండుభట్టియం అనే హాస్య నాటకం, నీలగిరి కొండల అందాన్ని వర్ణిస్తూ నీలగిరి పాటలు, హాలీస్ తోకచుక్క కనిపించడంతో సంబంధం ఉన్న మూఢనమ్మకాలను ఖండిస్తూ కన్న కలపు సిన్న బుద్ధులు అనే వ్యాసం, బిల్హణీయం అనే నాటకం, మద్రాస్ విశ్వవిద్యాలయం శాస్త్రీయ భాషను పాఠ్యాంశాల అభివృద్ధికి వేదికగా ఉంచాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా అసమ్మతి పత్రం మొదలగు రచనలు చేశారు.


వ్యవహారిక భాషోద్యమంలో...

20వ శతాబ్ది తొలినాళ్ళలో జరిగిన వ్యవహారిక భాషోద్యమంలో గురజాడ అప్పారావు తన సహాధ్యాయి గిడుగు రామమూర్తి పంతులుతో కలిసి పోరాటం సలిపారు. వారిద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వవిద్యాలయంలో గ్రాంథిక భాషావాదులతో అలసట ఎరగకుండా తలపడ్డారు. గిడుగు వాదనాబలానికి, గురజాడ రచనాశక్తి వ్యావహారిక భాషోద్యమానికి వినియోగపడ్డాయి. ఆయన నవంబర్ 30, 1915 లో పరమపదించారు. అంతటి మహానుభావుడు తెలుగు సాహిత్య రంగంలో నభూతో నభవిష్యతి.

***కింజరాపు అమరావతి***
***9494588909***
***(గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా)***

## విషయవాంఛను వదులుకోవాలి


**భక్తి**



"ఇంద్రియాల ద్వారా విషయాలను స్వీకరించని వ్యక్తి నుంచి ఇంద్రియ వస్తువులు దూరమైపోతాయి. కానీ 'రస్' (కాంక్ష/రాగం) దూరం కాదు. పరమాత్మను తెలుసుకున్నప్పుడు మాత్రమే కోరిక అంతమైపోతుంది" అని శ్రీకృష్ణుడు బోధిస్తున్నాడు. ఇంద్రియాలకు మెదడులో నియంత్రకాలు ఉంటాయి. మనస్సు అనేది ఇంద్రియ నియంత్రకాల కలయిక. ఈ నియంత్రకాలపై దృష్టి సారించాలని శ్రీకృష్ణుడు మనకు సలహా ఇస్తున్నాడు. ఇక్కడ శ్రీకృష్ణుడు 'రస్' అనే పదాన్ని ఉపయోగించాడు. పండిన పండ్లను కోసి, పిండినప్పుడు తప్ప రసం కనిపించదు. పాలలో ఉండే వెన్న పరిస్థితి కూడా అంతే. అలాగే ఇక్కడ 'రస్' అంటే ఇంద్రియ నియంత్రకాలలో ఉండే అంతర్గతమైన కోరిక. అజ్ఞాన స్థాయిలో... ఇంద్రియాలతో ఇంద్రియ వస్తువులు జతపడి ఉంటాయి. సుఖ దుఃఖాల ద్వంద్వాల మధ్య ఊగిసలాడుతూ ఉంటాయి. తదుపరి దశలో... కోరికలను తీర్చుకొనే మార్గం లేక... ఆ కోరికలను మనం వదిలేస్తాం. ఉదాహరణకు... డబ్బు లేకపోవడం లేదా వైద్యుల సలహా లాంటి బాహ్య పరిస్థితుల కారణంగా... మిఠాయి లాంటి ఇంద్రియ వస్తువులను వదిలేస్తాం. కానీ మిఠాయి పట్ల కోరిక మిగిలిపోతుంది. నైతికత, దేవుడు లేదా చట్టం పట్ల భయం, ప్రతిష్ట పోతుందనే అనుమానం, వృద్ధాప్యం లాంటి బాహ్య పరిస్థితుల కారణంగా కోరికలను వదిలేస్తాం. కానీ ఏ కారణం లేకుండానే విషయవాంఛలను అంటే అన్ని కోరికలను వదిలేసే పరమ దశ గురించి శ్రీకృష్ణుడు పై శ్లోకంలో సూచిస్తున్నాడు.

దీని కోసం ఒక ఆచరణాత్మకమైన చిట్కాను శ్రీకృష్ణుడు చెప్పాడు. అక్కడ ఆయన ఇంద్రియాలను ఆడని గుర్రాలతో పోల్చాడు. శిక్షకుడు కొంత కాలం వాటితోపాటు పరుగెత్తి... వాటిని నియంత్రణలోకి తీసుకువస్తాడు. వాటిని పూర్తిగా అర్థం చేసుకున్నాక... తన ఇష్టానుసారం వాటి మీద స్వారీ ప్రారంభిస్తాడు. ఇక్కడ గమనించవలసిన రెండు విషయాలు ఏమిటంటే... శిక్షకుడు గుర్రాలను ఒక్కసారిగా నియంత్రించలేదు. అలా చేస్తే అవి అతణ్ణి కింద పడేస్తాయి. అదే విధంగా, మన ఇంద్రియాలను ఒక్కసారిగా నియంత్రించడం ప్రారంభించలేం. వాటిని అర్థం చేసుకొని, నెమ్మదిగా అదుపులోకి తేవాలి.అంతవరకూ కొంతకాలం పాటు వాటి వ్యవహారాలకు అనుగుణంగా నడుచుకోవాలి. రెండోది, మనం ఇంద్రియాల ప్రభావంలో ఉన్నప్పుడు... వాటిని ప్రస్తుతం నియంత్రించలేకపోయినా.... భవిష్యత్తులో నియంత్రించాలనే నిరంతర అవగాహన మనకు ఉండాలి. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడనట్టు... అవగాహన, కోరిక... ఈ రెండిటిలో ఒకటి మాత్రమే మనలో ఉండగలదు. అవగాహన ఉన్నప్పుడు మనల్ని కోరికలు వాటి అధీనంలోకి తీసుకోలేవు. ఎందుకంటే అజ్ఞానంలో ఉన్నప్పుడే వాటి అధీనంలోకి మనం వెళ్ళడం జరుగుతుంది.


## మాయిశ్చరైజర్లు ఇంజక్షన్ రూపంలో...



చర్మపు తేమను పెంచడానికి, హైల్యురోనిక్ యాసిడ్ ఎంతో బాగా ఉపయోగపడుతుంది. దీన్ని నేరుగా చర్మంలోకి ఇంజెక్ట్ చేయగలిగే వెసులుబాట్లు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. అలాగే వయసుతో పాటు పెరిగే చర్మపు ముడతలను తగ్గించడం కోసం, హైల్యురోనిక్ యాసిడ్‌తో పాటు, గ్లూటోథయాన్, పాలీడియాక్సీ న్యూక్లియొటైడ్ అనే పెప్టైడ్స్‌ను కలిగి ఉండే వాటినీ, విటమిన్ సిని కూడా జోడించి ఇంజెక్ట్ చేయవచ్చు. వీటితో యాంటీ ఏజింగ్, స్కిన్ లైటెనింగ్ ప్రయోజనాలను కూడా పొందవచ్చు. వీటితో చర్మం మెరుగ్గా హైడ్రేట్ అవడంతో పాటు మెరుపును కూడా సంతరించుకుంటుంది.

ఏ వయసు వారైనా...ఈ చికిత్సకు వయసుతో సంబంధం లేదు. 20 నుంచి 60 ఏళ్ల వాళ్లు కూడా ఈ ఇంజెక్టబుల్ చికిత్సల ప్రయోజనాలను పొందవచ్చు. వీటిలో వయసుకు తగిన ఇంజెక్టబుల్ మాయిశ్చరైజర్స్ ఉన్నాయి. కొన్ని ఇంజెక్షన్ల ప్రభావం 3 నుంచి ఆరు నెలలు ఉంటుంది. ఇంకొన్నిటిని ప్రతి ఆరు నెలలకూ రిపీట్ చేస్తూ ఉండాలి. హైల్యురోనిక్ యాసిడ్ సాంద్రత మీదే ఇదంతా ఆధారపడి ఉంటుంది. ఇది డే కేర్ ప్రొసిజర్. చికిత్స తర్వాత సగం రోజులోనే వాపు మొత్తం తగ్గిపోతుంది. ఒక్క రోజులో పూర్తిగా నార్మల్ అయిపోతుంది. ప్రభావం కనిపించడానికి వారం నుంచి పది రోజుల సమయం పడుతుంది. పెళ్లిళ్లు, వేడుకలకు ముందు ముఖం మెరుస్తూ, ఆకర్షణీయంగా కనిపించడం కోసం ఈ చికిత్సలను ఎవరైనా ఎంచుకోవచ్చు. ఈ ఇంజక్షన్లకు ఎటువంటి దుష్ప్రభావాలూ ఉండవు.

# యాచకురాలు అయింది చట్టభద్రురాలు




ఒక వయసు వచ్చాక శరీరంలో వచ్చిన మార్పులు అర్థం కాలేదు..ఇంటి నుంచి, సమాజం నుంచి వచ్చే ఛీత్కారాలు ఎందుకో అర్థం కాలేదు..తనలా ఉండేవారితో కలిసిపోవడానికి వచ్చినవారి ప్రవర్తన అర్థం కాలేదు..అర్థమైంది ఒక్కటే... చదువు మాత్రమే తనకు మనుగడ ఇస్తుందని. తను నమ్ముకున్న చదువే యాచన నుంచి న్యాయవాదిగా మార్చింది. పాకిస్థాన్ మొట్టమొదటి ట్రాన్స్‌జెండర్ లాయర్‌గా స్థానం పొందింది. మన దేశంలో మూడేళ్ల క్రితం జోయితా మొండల్ మొట్టమొదటి ట్రాన్స్‌జెండర్ న్యాయవాదిగా గుర్తింపు పొందింది. ఇప్పుడు ఆ 'మొదటి' స్థానాన్ని పాకిస్థాన్‌లో నిషారావు సొంతం చేసుకుంది. సమాజంలో థర్డ్ జెండర్ తన సత్తా చాటుతోంది అని నిరూపిస్తోంది.



**రెండు రొట్టెల కోసం పాట్లు**

తన కృషికి ఫలితం లభించినందుకు ఈ రోజు నిషా సంతోషంగా ఉంది. కానీ, ఆమె ఎదుర్కొన్న ఆటుపోట్లు సామాన్యమైనవి కావు. 28 ఏళ్ల నిషా మధ్యతరగతి కుటుంబానికి చెందినది. తనలో వచ్చిన మార్పులకు ఇంటి నుంచి నిరాదరణ, సమాజం నుంచి ఛీత్కారాలు ఎదుర్కొంది. భరించలేక మరో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లతో కలిసి ఇంటి నుంచి బయలుదేరింది. తనలా ఉండే ట్రాన్స్‌జెండర్లతో కలిసి కరాచీకి వెళ్లింది. కానీ, తినడానికి తిండి లేక చాలా కష్టాలు పడింది. 'రోజుకు రెండుసార్లు రొట్టెలు కావాలంటే సెక్స్ వర్కర్ కావాలని సలహా ఇచ్చారు తోటి వాళ్లు. కానీ, ఆ పని నాకు నచ్చలేదు. అదే విషయాన్ని చెప్పి యాచనవైపు వెళ్లాను' అని చెప్పింది నిషా.

**ట్రాఫిక్ లైట్ల నుంచి లా కాలేజీ వరకు**

జీవనోపాధి కోసం ట్రాఫిక్ లైట్ల వద్ద యాచించడం ప్రారంభించింది. ఛీత్కారాలూ భరించింది. 'కానీ కొన్ని రోజులకు ఈ పని కూడా నచ్చలేదు. అప్పుడే చదువుకోవాలనుకున్నాను. గౌరవమైన జీవనం కావాలనుకున్నాను. ఈ ఆలోచన రాగానే స్కూల్ చదువుతో ఆపేసిన చదువును తిరిగి కొనసాగించాను' అని తెలిపింది నిషా. పగటిపూట యాచించడం, రాత్రిళ్లు చదువుకోవడం.. ఇదే ఆమె దినచర్యగా మారింది. 2018లో నిషా సింధ్ ముస్లిం లా కాలేజీ నుండి పట్టభద్రురాలైంది. రావు ఇప్పటివరకు 50 కేసులను వాదించింది. ఆమె క్లయింట్‌లలో చాలామంది ట్రాన్స్‌జెండర్లు కూడా ఉన్నారు. లింగమార్పిడి ప్రజలకు వారి హక్కులను పొందడానికి ప్రయత్నిస్తున్న ఒక ఎన్జీఓ కోసం కూడా ఆమె పనిచేస్తోంది.

**ట్రాన్స్‌జెండర్స్ ఓల్డేజీ హోమ్**

యాచన చేసే ట్రాన్స్‌జెండర్ నయాబ్ మాట్లాడుతూ.. 'నిషా మాతో యాచించడం ద్వారా జీవించేది. కానీ ఈ రోజు తన వల్ల మేమూ ఉత్తమ స్థితిలో ఉన్నాం. ఆమె మాకు అన్ని సమయాలలో సహాయం చేయడానికి సిద్ధంగా ఉంది. అర్ధరాత్రి కూడా ఆమె నుండి సహాయం కోరినా ఎప్పుడూ నిరాకరించదు. ట్రాన్స్‌జండర్లు ముసలివాళ్లు అయ్యాక వారిని పట్టించుకునేవారే ఉండరు.

ఆ వయసు వారు ఎంతో దుర్భరమైన జీవనాన్ని గడుపుతున్నారు. అందుకే వారి కోసం ఓ ఓల్డేజీ హోమ్‌ను నిర్మించాలనుకుంటుంది' అని వివరించింది.

చదువు జీవనగతిని మార్చుతుంది. చదువు ఉన్నతస్థితికి చేర్చుతుంది. చదువు జాతి, మత, కులాలకు అతీతంగా ఎదిగేందుకు ఊతం ఇస్తుంది. అందుకు నిదర్శనంగా నిలుస్తున్నారు నిషారావు వంటివారు.



# బాల్కనీలో పచ్చనితోట



మొక్కల్ని పెంచుకోవాలని చాలామందికి ఉన్నా...సరైన స్థలం లేదని బాధపడిపోతుంటారు. అయితే మనసుంటే కొద్దిపాటి స్థలాన్ని కూడా అందంగా మార్చేసుకోవచ్చు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్ బాల్కనీలను నందనవనంగా తీర్చిదిద్దుకోవచ్చు. బాల్కనీ ఎంత చిన్నదైనా సరే! ఒకవైపు గోడను వర్టికల్ గార్డెన్‌లా మార్చేయొచ్చు. అంటే చెక్కలేదా ఏదైనా ఇనుప ఫ్రేమ్‌ని ఉపయోగించి గోడపై మొక్కల్ని పెంచొచ్చు. అందంగా, తీరైన ఆకృతిలో కనిపించాలంటే ఒక్కో వరుసలో ఒక్కో రకాన్ని ఎంచుకున్నా చాలు. చూడ ముచ్చటగా ఉంటాయి.

–బాల్కనీ గ్రిల్స్‌కి చెక్కలేదా ఇనుమతో బుట్టలను తయారు చేయించి హుక్‌లా వేలాడదీయండి. ఇలా కనీసం ఐదారు కుండీలైనా ఏర్పాటు చేసుకోవచ్చు. అలానే బాల్కనీ పై నుంచి కిందకి వేలాడేలా కుండీలను పెట్టి వాటిల్లోనూ మొక్కలు పెంచుకోవచ్చు.

– ఇనుప నిచ్చెనలు ఇప్పుడు బజార్లో లభిస్తున్నాయి. కాస్త వెడల్పు మెట్లు ఉండేలా ఒకదాన్ని ఎంచుకోండి. దాని ఒక్కో మెట్టుపై రెండు చొప్పున కుండీలు పెట్టినా చాలు. చక్కగా కనిపిస్తాయి. అలానే పాత కుర్చీలూ, బల్లల్ని బాల్కనీలో వేసి వాటిపైనా మొక్కల్ని పెంచుకోవచ్చు.



## హైదరాబాదీ మటన్ మసాలా



కావలసినవి: మటన్: అరకిలో, ఉల్లిపాయలు: రెండు, నూనె: 3 టేబుల్‌స్పూన్లు, అల్లం వెల్లుల్లి: టేబుల్‌స్పూను, ఉప్పు: రుచికి సరిపడా, కారం: టేబుల్‌స్పూను, పసుపు: అరటీస్పూను, దనియాలపొడి: టేబుల్‌స్పూను, జీలకర్రపొడి: టీస్పూను, టొమాటోలు: రెండు, పెరుగు: కప్పు, కొత్తిమీర తురుము: 2 టేబుల్‌స్పూన్లు, మటన్ మసాలా: టీస్పూను, గరంమసాలా: అరటీస్పూను.

**తయారుచేసే విధానం:** మటన్ ముక్కలను శుభ్రంగా కడిగి, అందులో కొద్దిగా నూనె, ఉప్పు వేసి పది నిమిషాలు ఉడికించాలి.

– ప్రెషర్ పాన్‌లో నూనె వేసి ఉల్లిముక్కలు వేసి వేగాక, అల్లంవెల్లుల్లి వేసి వేయించాలి. తరవాత మటన్ ముక్కలు వేసి ఓ రెండు నిమిషాలు వేయించాలి. ఇప్పుడు ఉప్పు, కారం, పసుపు, దనియాలపొడి, జీలకర్ర, మటన్ మసాలా పొడి వేసి రెండు నిమిషాల పాటు సిమ్‌లో ఉడికించాలి. తరవాత సన్నగా కోసిన టొమాటో ముక్కలు వేసి అవి ఉడికాక పెరుగు వేసి కలపాలి. నూనె తేలే వరకూ ఉడికించి, కొద్దిగా నీళ్లు, కొత్తిమీర తురుము వేసి మూతపెట్టి సిమ్‌లో ముక్కలు మెత్తగా అయ్యేవరకూ ఉడికించాలి. చివరగా గరంమసాలా,

# స్విమ్మింగ్ లలిత.. పతకాల చరిత



**యాభై ఏళ్లు వచ్చేసరికి ముప్పావు జీవితం అయిపోయిందని మూలన కూర్చుంటాం. తుర్లపాటి లలిత చూడండి. హాఫ్‌సెంచరీ తరువాతే హాయిగా ఈతకొలనులో కెరీర్ మొదలుపెట్టారు. ఆ వయసు స్విమ్మర్లతో పోటీపడుతూ పతకాల పంట పండిస్తున్నారు..**

"అసలు నేను నేషనల్స్‌కు వెళతానని, ఇన్నేసి బంగారు పతకాలు కొడతానని ఊహించనేలేదు. చాలామంది నమ్మరు కానీ.. నేను స్విమ్మింగ్ లో చిన్న శిక్షణ కూడా తీసుకోలేదు. అనుకోకుండా ఈతకొలనులోకి దిగాను. ముందు మా కుటుంబ విషయాలకు వస్తే – మాది హైదరాబాద్. నా భర్త వ్యాపారవేత్త. ఇద్దరు పిల్లల్లో ఒకరు అమెరికాలో స్థిరపడ్డారు. ఇంకొకరు ఇక్కడే ఉంటారు. ఇంట్లోని పనులతోనే నాకు సరిపోయేది. ఈత మీద ధ్యాస ఉండేది కాదు. బీఏ, బీఈడీ చదువుకున్నాను. కొన్నాళ్లు మాత్రమే ఉద్యోగం చేశాను కానీ.. కొనసాగించలేదు.

పిల్లలకు పెళ్లిళ్లు పూర్తయి కుదుటపడ్డాక.. సమయం దొరికేది. అయితే ఏదో ఒకటి చేయాలన్న లక్ష్యాలేవీ ఉండేవి కావు. ఒక సందర్భంలో – వయసు మీదపడటంతో కీళ్ల నొప్పుల సమస్యలు వచ్చాయి. వైద్యచికిత్స కోసమని డాక్టర్ దగ్గరికి వెళ్లాను. నా ఫిట్‌నెస్ చూసిన డాక్టర్ స్విమ్మింగ్ చేయమని సలహా ఇచ్చింది. అప్పటికి నా వయసు యాభైఏళ్లు. అంతవరకు స్విమ్మింగ్‌తో నాకు ఎటువంటి పరిచయం లేదు. దీన్నొక కెరీర్‌గా ఎంచుకోవచ్చన్న ధ్యాస కూడా ఉండేది కాదు. సరదాగా ఈత మొదలుపెట్టి.. సీరియస్‌గా తీసుకున్నాను. ఇంటికి దగ్గర్లోని ఒక ఇండోర్ స్విమ్మింగ్‌పూల్‌లో తొలిసారి స్విమ్ చేశాను. ఆ తరువాత పెద్ద ఈతకొలనుకు వెళ్లేదాన్ని. ఈతలో వేగం పెరిగితే.. నా వయసు వాళ్లకు నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చని తెలిసింది. పట్టుదలతో మరింత కఠినమైన ప్రాక్టీస్ చేసి.. టోర్నమెంట్‌లలో పాల్గొనడం ప్రారంభించాను. కుటుంబ సభ్యులు కూడా అడ్డుచెప్పలేదు. ఫలితం కోసం ఆశించకుండా ప్రోత్సహించారు.

**తొలిసారి గెలిచి..**

అది 2012. ఈతపోటీల్లో పాల్గొనడం అదే మొదటిసారి. రాష్ట్రస్థాయి పోటీల్లో ధైర్యంగా పాల్గొన్నాను. తొలిసారి బంగారు పతకాలు నా ఖాతాలో పడ్డాయి. నా మీద నాకు నమ్మకం పెరిగింది. ఆ తరువాత భోపాల్‌లో జరిగిన నేషనల్స్‌లో ఒక గోల్డ్‌మెడల్ వచ్చింది. ఈ పోటీల్లో తీవ్రమైన పోటీ ఎదుర్కొన్నాను. ఎందుకంటే దేశవ్యాప్తంగా క్రీడాకారులు వచ్చారక్కడికి. ఇవన్నీ మాస్టర్స్ టోర్నమెంట్స్. 25 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వయస్కుల మధ్య ఈ పోటీలు జరుగుతాయి. ఐదేళ్ల వ్యత్యాసంతో పోటీ విభాగాలను నిర్దేశిస్తారు. అంటే యాభై నుంచి యాభై ఐదేళ్ల మధ్య వయస్కులు ఒక విభాగం అన్న మాట. వారి మధ్యనే ఈతపోటీలు జరుగుతాయి. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలో నా వయసు వాళ్లు అతితక్కువ మంది ఈతపోటీల్లో పాల్గొనేవారు. ఇప్పుడు వారి సంఖ్య పెరిగింది. జాతీయ స్థాయిలో అయితే అత్యధికంగా ఉంది.

**పతకం.. పదిలం**

ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో ఎనిమిది బంగారు పతకాలు, జాతీయస్థాయిలో పదకొండు పతకాలు గెల్చుకున్నాను. ఈ మధ్యనే సికింద్రాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి ఈత పోటీల్లో పతకాలు సాధించడం చాలా సంతోషంగా అనిపించింది.

**నా మీద నాకు ఆత్మ**

విశ్వాసం మరింత పెరిగింది. తెలంగాణ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ టోర్నమెంట్‌లో కూడా మంచి ఫలితాలు దక్కాయి. చాలామంది నన్ను అడుగుతుంటారు.. 'నువ్వు ఈతలో అంత నైపుణ్యం ఎలా సాధించావని'. నేనేమీ స్విమ్మింగ్ అంత కష్టమని భావించలేదు. ఈతలో రకరకాల స్ట్రోక్స్ ఉంటాయి. ఫ్రీస్టయిల్స్, బటర్‌ఫ్లై వంటివన్నీ స్వయంగా నేర్చుకున్నాను. నాకు ఏ మాత్రం సందేహం వచ్చినా ఇంటర్‌నెట్‌ను చూసేదాన్ని. స్పోర్ట్స్‌లో ఎన్నిరకాల స్విమ్మింగ్ స్ట్రోక్స్ ఉన్నాయో అవన్నీ ఇంటర్‌నెట్‌లో చూసి నేర్చుకోవచ్చు. నాది చిన్న విజయమే కావొచ్చు. కానీ.. జీవితాన్ని ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా తీర్చిదిద్దుకోవడం అనేది మన చేతుల్లోనే ఉంటుంది. ఈ వయసులో ఇంటికే పరిమితం కాలేదు నేను. నాకొక వ్యాపకం అలవాటైంది. ఈత కొడుతూ ఒక వైపు ఆరోగ్యాన్ని, మరోవైపు పతకాలను గెల్చుకుంటున్నందుకు చాలా హ్యాపీగా అనిపిస్తున్నది.

# మామిడి పోషకాల్లో మేటి



వేసవి వచ్చేసింది. నోరూరించే తీయని మామిడిపండ్లు రుచికే కాదు, ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయి. ఇందులో ఉండే పిండిపదార్థాలూ, విటమిన్–ఎ, కె, బి6, పొటాషియం లాంటి మూలకాలూ, తదితర పోషకాలెన్నో మామిడిపండు సొంతం. మనమెంతో ఇష్టంగా తినే మామిడి పండు ఆరోగ్యానికి ఎలా మేలుచేస్తుందంటే...

* ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కంటి సంబంధ సమస్యల్ని దూరంగా ఉంచుతాయి. అలాగే కండరాల సామర్థ్యాన్ని పెంచి, శరీరాన్ని దృఢంగా మారుస్తాయి.
* మామిడిపండులో ఉండే బీటా కెరొటిన్ వల్ల రోగనిరోధకశక్తి పెరిగి, శ్వాసకోశ సంబంధిత సమస్యలూ, ఇన్‌ఫెక్షన్లూ దరిచేరవు. అలాగే కొన్నిరకాల క్యాన్సర్లను కూడా దూరంగా ఉంచుతుంది.
* మామిడిలో ఉండే విటమిన్–కె ఎముకల దృఢత్వాన్ని పెంచుతుంది. ఎముకల సాంద్రత పెరగడమే కాదు, ఆస్టియోపొరోసిస్ సమస్య రాకుండా కూడా చేస్తుంది. .
* మామిడిలో ఉండే పీచూ, నీటి శాతం జీర్ణాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అలాగే జీవక్రియల పనితీరు కూడా వేగవంతం అవుతుంది. చెడు కొలెస్ట్రాల్ సమస్య తగ్గుతుంది. మామిడి పండులో ఉండే పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచి, హృద్రోగాలను దూరం చేస్తాయి.
* మామిడిపండులోని విటమిన్–ఎ, సి జుట్టూ, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. మామిడిపండు ద్వారా చర్మం కాంతిమంతంగా తయారవుతుంది. చర్మసంబంధితమైన వ్యాధుల్ని కూడా దూరంగా ఉంచొచ్చు. వయసుపైబడిన ఛాయలు, ముడతలు పోతాయి.
* ఇందులో ఐరన్ కూడా ఎక్కువే కాబట్టి... దీనిని తింటే రక్తహీనతకు దూరంగా ఉండవచ్చు. అలాగే గర్భిణీలు కూడా దీన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల అవసరమైన ఇనుము కూడా అందుతుంది.

## ఆత్మవిశ్వాసంతో ఆకట్టుకుందాం

**బా**ధ్యతలను పక్కాగా నిర్వర్తించలేకపోతున్నామనే సందేహం, లక్ష్యాన్ని పూర్తిచేసినా కూడా తప్పులేమైనా జరిగాయా అనే ఆలోచనలు మనలో వచ్చాయంటే, ఆత్మనూన్యత ఉన్నట్లే. అలాకాకుండా, ఆత్మవిశ్వాసంతో పనిచేయాలంటే...

సందేహం వద్దు: ఆత్మవిశ్వాసం తగ్గినప్పుడు మిమ్మల్ని మీరు సందేహించుకోకుండా ఉండాలంటే, మీ సామర్థ్యంపై మీకు నమ్మకం ఉండాలి. దానికోసం గతంలో మీరు సాధించిన విజయాలను, లక్ష్యాలను గుర్తుచేసుకోవాలి. అవి మీలో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, కోల్పోయిన ఆత్మవిశ్వాసాన్ని తిరిగి అందిస్తాయి.

పొరపాట్లు సహజం: విధుల్లో పొరపాట్లు జరిగినప్పుడు పూర్తిగా విఫలమైనట్లు కాదు. అందులోంచి పాఠాలు నేర్చుకోవాలి. ఇది మీలో ఆలోచనాశక్తిని పెంచుతుంది. మరోసారి అదే పనిని పరిపూర్ణంగా, లోపాలు లేకుండా పూర్తి చేయగలిగే సామర్థ్యాన్ని అందిస్తుంది.

విజ్ఞానం పెంచుకునేలా: ఎప్పటికప్పుడు కొత్తవిషయాలు తెలుసుకోవాలి. స్ఫూర్తి కలిగించే వ్యక్తుల గురించి చదవాలి. పుస్తకపఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలి. ఆఫీస్‌లో విధుల నిర్వహణలో మీలో ఏ అంశంపై లోపం ఉందో తెలుసుకుంటే, అధిగమించడానికి తగిన శిక్షణ తీసుకోవాలి. అనుభవజ్ఞుల్ని సంప్రదించి, మెలకువలు నేర్చుకోవాలి.



సందేహాలు తీర్చుకోవాలి: పని విషయంలో ఏ సందేహం వచ్చినా తీర్చుకోవాలి. అప్పుడే మీ సామర్థ్యంపై మీకు నమ్మకం పెరుగుతుంది. అలాగే సానుకూల ఆలోచనల్ని పెంచుకోవాలి. మీరు చేసిన పనిలో సత్ఫలితాలు వస్తే, సమావేశాల్లో కొత్త ఆలోచనలు చెబితే, నిర్ణీత

## సెన్సెక్స్, నిఫ్టీప ఆల్ టైమ్ హై.. ఒక్క రోజులో రూ.6 లక్షల కోట్లు లాభం..




**న్యూఢిల్లీ- నవ భూమి:** అమెరికా ఫెడరల్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించడంతో దేశీయ సూచీలు బుల్ జోరు చూపిస్తున్నాయి. ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు భారత మార్కెట్లకు మేలు చేస్తుందనే అంచనాలు వెలువడుతుండడంతో దేశీయ సూచీలు వరుసగా రెండో రోజూ లాభాలు అందుకుని జీవన కాల గరిష్ఠాలకు చేరుకున్నాయి. సెన్సెక్స్ 84, 500 పాయింట్ల పైన క్లోజ్ అయింది. నిఫ్టీ 25, 750పై స్థిరపడింది. రెండు ప్రధాన సూచీలు ఆల్ టైమ్ హైకి చేరుకున్నాయి. బ్యాంక్ ఇండెక్స్, మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు భారీ లాభాలను మూటగట్టుకున్నాయి. దీంతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల విలువ ఒక్క రోజులోనే రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.472 లక్షల కోట్లకు చేరింది. గురువారం ముగింపు (83, 184)తో పోల్చుకుంటే దాదాపు 500 పాయింట్ల లాభంతో 83, 603 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో 1500 పాయింట్లకు పైగా లాభపడి 84, 694 వద్ద ఇంట్రాడే గరిష్ఠానికి చేరుకుంది. శుక్రవారం సెన్సెక్స్ 83, 187-84, 694 శ్రేణి మధ్య కదలాడింది. చివరకు సెన్సెక్స్ 1359 పాయింట్ల లాభంతో 84, 544 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. ఒక దశలో 25, 849 వద్ద జీవన కాల గరిష్ఠాన్ని చేరుకుంది. చివరకు 375 పాయింట్ల భారీ లాభంతో 25, 790 వద్ద స్థిరపడింది.




## ఐఫోన్ 16 కోసం 20 గంటలు లైన్లో వేచిఉన్న ప్రజలు



**న్యూఢిల్లీ- నవభూమి:** ఐఫోన్ 16 సిరీస్ పాపులర్ అయిన వెంటనే ఆపిల్ అభిమానుల్లో క్రేజ్ మరింత పెరిగింది. ఆపిల్ ఐఫోన్ 16 సిరీస్‌ను సెప్టెంబర్ 9న విడుదల చేసింది. నేటి (సెప్టెంబర్ 20) నుంచి భారతదేశంలో వీటి విక్రయాలు మొదలయ్యాయి. దీంతో ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లను కొనుగోలు చేసేందుకు నిన్న రాత్రి నుంచే ముంబైలోని బీకేసీ యాపిల్ స్టోర్ బయట అనేక మంది క్యూలో నిల్చున్నారు. ఈ ఆపిల్ స్టోర్ ఏప్రిల్ 2023లో ప్రారంభించబడింది. ఐఫోన్ 16 కొనడానికి బీకేసీ వెలుపల వందలాది మంది గుమిగూడారు. కొంత మంది 21 గంటల పాటు లైన్‌లో నిలబడి ఉండటం విశేషం.స్టోర్ తలుపులు తెరవగానే ఐఫోన్ 16 కొనడానికి ప్రజలు పెద్ద ఎత్తున పోటెత్తారు. రద్దీని నియంత్రించేందుకు వీలుగా లోపల, బయట గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఢిల్లీలోనూ ఐఫోన్ కొనేందుకు ప్రజల్లో విపరీతమైన ఉత్సాహం కనిపిస్తోంది. సాకేత్‌లో ఉన్న సెలెక్ట్ సిటీ వాక్‌లో ప్రజలు పొడవైన క్యూలలో నిలబడి ఉన్నారు. అందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## మార్కెట్‌కు ఫెడ్ బూస్ట్



**న్యూఢిల్లీ- నవభూమి:** అమెరికా కేంద్ర బ్యాంక్ వడ్డీరేట్లను 0.50 శాతం తగ్గించడం ఈక్విటీ మార్కెట్లకు ఉత్సాహాన్నిచ్చింది. మదుపరులు జోరుగా కొనుగోళ్లు జరపడంతో గురువారం దేశీయ ఈక్విటీ సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ ఒక దశలో 825.38 పాయింట్లు ఎగబాకి 83,773.61 వద్ద ఆల్ టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. కానీ, గరిష్ఠ స్థాయిల్లో లాభాల స్వీకరణ కారణంగా చివరికి 236.57 పాయింట్ల లాభంతో 83,184.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఉదయం 234.4 పాయింట్ల వృద్ధితో 25,611.95 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసినప్పటికీ, చివరికి 38.25 పాయిం ట్ల లాభంతో 25,415.80 వద్ద క్లోజైంది.

ఎన్‌టీపీసీ షేరు 2.45 శాతం రాణించి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎసఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.06 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.53 శాతం తగ్గాయి.

భారత కరెన్సీ రెండు నెలల గరిష్ఠ స్థాయికి పెరిగింది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు పెరిగి 83.65 వద్ద ముగిసింది.

ఆర్కేడ్ డెవలపర్స్ ఐపీఓకు చివరి రోజు నాటికి 106.40 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించగా.. నార్తర్న్ ఏఆర్‌సీ క్యాపిటల్ ఇష్యూకు 110.71 రెట్ల బిడ్లు వచ్చాయి. వెస్టర్న్ క్యారియర్ ఆఫర్ 30.46 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.కోల్‌కతాకు చెందిన ఎల్లెన్‌బ్యారీ ఇండస్ట్రియల్స్ గ్యాసెస్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయి పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.400 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.44 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

## మార్కెట్లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బెటాలియన్ బ్లాక్..!



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బుల్లెట్ 350 మోటారు సైకిళ్లను విస్తరిస్తోంది. తాజాగా రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బుల్లెట్ 350 'బెటాలియన్ బ్లాక్' మోటారు సైకిల్‌ను శుక్రవారం భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.1,74,730 పలుకుతుంది. ఐకానిక్ మోడల్ మోటారు సైకిల్ పలు మార్పులతో వస్తోంది.వింటేజ్ డిజైన్ క్యూస్, బెటాలియన్ బ్లాక్ ఎడిషన్ మోటారు సైకిళ్లు పాత మోడల్ బైక్స్ నుంచి బెంచ్ సీట్, హ్యాండ్ పెయింటెడ్ గోల్డ్ పిన్ స్ట్రైప్స్, ట్యాంక్ అండ్ సైడ్ ప్యానెల్స్ మీద 3డీ బ్యాడ్జెస్ వంటి పలు రెట్రో ఫీచర్లను తీసుకొస్తోంది రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 350 బెటాలియన్ బ్లాక్ మోటారు సైకిల్. స్పోక్ వీల్స్‌తోపాటు క్రోమ్ రిమ్స్, బ్లాక్ మిర్రర్స్, ఓల్డ్ లైసెన్స్ ప్లేట్, టెయిల్ లాంప్ రిమినిస్కెంట్ వంటి ఫీచర్లు జత చేశారు.జే-ప్లాట్ ఫామ్ పై రూపుదిద్దుకున్న 349సీసీ సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్ మోటారు కలిగి ఉంటుంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 20.2 హెచ్పీ విద్యుత్, 27 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. 5-స్పీడ్ గేర్ బాక్స్ ఉంటది. సేఫ్టీని పెంపొందించే సింగిల్ చానెల్ ఏబీఎస్‌తో కూడిన 300 ఎంఎం ఫ్రంట్ డిస్క్, 153 ఎంఎం రేర్ డ్రమ్ బ్రేక్స్ ఉంటాయి. ఇక మిలిటరీ వేరియంట్ బెటాలియన్ బ్లాక్ ఎడిషన్, బ్లాక్ గోల్డ్ స్టాండర్డ్ వేరియంట్లలో లభిస్తుందీ రాయల్ ఎన్ ఫీల్డ్ 'బెటాలియన్ బ్లాక్' మోటారు సైకిల్. ఫెస్టివ్ సీజన్ నేపథ్యంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బుల్లెట్ బ్లాక్ బెటాలియన్ ఆవిష్కరించడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

# బంగారం ప్రియులకు భారీ షాక్.. ఆల్ టైం హైకి ధరలు



**హైదరాబాద్ : నవభూమి:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ బుధవారం వడ్డీ రేట్లను తగ్గించిన నేపథ్యంలో హైదరాబాద్‌లో ఇవాళ బంగారం ధరలు ఆల్ టైమ్ గరిష్టానికి చేరుకున్నాయి. సెప్టెంబర్ 19న రూ.74,450 ఉన్న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర నేడు ఒక శాతం మేర పెరిగింది. హైదరాబాద్‌లో బంగారం ధర ఇవాళ రూ.75 వేల మార్కును దాటింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.68,850గా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.75,110గా ఉంది. మే నెలలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం, 24 క్యారెట్ల బంగారం ధరలు వరుసగా రూ.68,900 , రూ.75,160గా నమోదయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న బంగారం ధరలెలా ఉన్నాయో తెలుసుకుందాం.

న్యూఢిల్లీ 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.69,000, 24 క్యారెట్ల బంగారం ధరలు 10 గ్రాముల ధర రూ.75,260గా ఉంది.

కోల్‌కతా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.68, 850, 24 క్యారెట్ల బంగారం ధరలు 10 గ్రాముల ధర రూ.75,110గా ఉంది.

ముంబయి 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.68, 850, 24 క్యారెట్ల బంగారం ధరలు 10 గ్రాముల ధర రూ.75,110గా ఉంది.

హైదరాబాద్ 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.68, 850, 24 క్యారెట్ల బంగారం ధరలు 10 గ్రాముల ధర రూ.75,110గా ఉంది.

చెన్నై 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.68, 850, 24 క్యారెట్ల బంగారం ధరలు 10 గ్రాముల ధర రూ.75,110గా ఉంది.

రేట్లు పెరగడానికి కారణాలు

హైదరాబాద్ సహా ప్రపంచ దేశాల్లో బంగారం ధరలు పెరగడానికి పలు కారణాలున్నాయి. అందులో ముఖ్యమైనది అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గించడం. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేటును మెజారిటీ విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగా అర(0.50) శాతం తగ్గించింది.

దాంతో ప్రామాణిక వడ్డీ రేట్ల శ్రేణి 23 ఏళ్ల గరిష్ఠ స్థాయి 5.25-5.50 శాతం నుంచి 4.75-5.0 శాతానికి తగ్గింది. నవంబర్‌లో అమెరికా ఫెడ్ వడ్డీరేట్లను కనీసం 25 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే బంగారం ధరలు పెరిగినందున భారత్‌లో బంగారం కొనుగోళ్లు తగ్గవచ్చు. ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, మధ్యప్రాచ్యంలోని భౌగోళిక రాజకీయ పరిస్థితులు సహా అనేక అంశాలు బంగారం ధరలపై ప్రభావం చూపిస్తున్నాయి.

## స్టాక్ మార్కెట్ల కొత్త చరిత్ర.. తొలిసారిగా 84వేల మార్క్‌ను దాటిన సెన్సెక్స్.. 1350 పాయింట్లపైగా జంప్..!



**న్యూఢిల్లీ- నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు కొత్త రికార్డులు సృష్టించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 84వేల మార్క్‌ని దాటింది. నిఫ్టీ సైతం 25,800 పాయింట్ల ట్రేడయ్యింది. చివరకు రికార్డు స్థాయిలోనే ముగిశాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 1359 పాయింట్లు, నిఫ్టీ 375 పాయింట్లకుపైగా లాభపడి తొలిసారిగా గరిష్ఠ స్థాయిలో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నాలుగు సంవత్సరాల తర్వాత వడ్డీ రేట్లను తగ్గించింది. దీంతో మార్కెట్లకు కొత్త ఊపినిచ్చినట్లయ్యింది. ఈ క్రమంలో గురువారం అమెరికా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లు తొలిసారిగా కొత్త గరిష్ఠాలను నమోదు చేశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,603.04 వద్ద భారీ లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత పెరుగుతూ మధ్యాహ్నం వరకు తొలిసారిగా 84వేల మార్క్‌ను దాటింది.

అదే ఊపును కొనసాగిస్తూ తొలిసారిగా రికార్డు స్థాయిలో 84,694.46 పాయింట్లను తాకింది. చివరకు 1,359.52 పాయింట్ల లాభంతో 84,544.31 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 25,525.95 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 25,426.60 పాయింట్ల కనిష్ఠానికి చేరి.. 25,849.25 గరిష్ఠానికి చేరింది. ఈ స్థాయికి నిఫ్టీ చేరుకోవడం ఇదే తొలిసారి. చివరకు 375.15 పాయింట్ల లాభంతో 25,790.95 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 2,346 షేర్లు పురోగమించగా.. 1,434 షేర్లు పతనమయ్యాయి. ఇక ఆటో, బ్యాంక్, క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, ఎఫ్ఎంసీజీ, పవర్, టెలికాం, మెటల్, రియల్టీ ఒకశాతం నుంచి మూడుశాతం లాభాలను నమోదు చేశాయి. నిఫ్టీలో ఎంఅండ్ఎం, ఐసీఐసీఐ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, ఎల్అండ్‌టీ, అత్యధికంగా లాభపడ్డాయి. గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ, ఇండస్ఇండ్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ నష్టపోయాయి. బీఎస్ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒకశాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి.

## వీడియో కాల్‌లో విచారణ పేరిట రూ. 9 లక్షలకు స్కామర్ల స్కెచ్



**న్యూఢిల్లీ- నవభూమి:** దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. రోజుకో తరహా స్కామ్‌తో సైబర్ నేరగాళ్లు చెలరేగుతున్నారు. ముంబైకి చెందిన ఓ రైల్వే అధికారి (59)ని స్కామ్‌స్టర్లు ఏకంగా రూ. 9 లక్షలకు టోకరా వేశారు. బాధితుడు తన ఫోన్‌లో జీరో ప్రెస్ చేయగానే వీడియో కాల్ కనెక్ట్ అయింది. అవతలి వ్యక్తి తాను జడ్జినని చెబుతూ నయవంచనకు తెరతీశాడు.జీరో ప్రెస్ చేయకుంటే మీ మొబైల్ నెంబర్ బ్లాక్ అవుతుందని తన ఫోన్‌కు మెసేజ్ రావడంతో బాధితుడు జీరో ప్రెస్ చేయగానే నిందితుల సూచనలకు అనుగుణంగా వీడియో కాల్ కనెక్ట్ చేశారు. ఆపై తాను సీబీఐ అధికారినని ఓ వ్యక్తి పరిచయం చేసుకుని బాధితుడిపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదైందని నమ్మబలికాడు. ఇక బాధితుడిని ఎవరినీ సంప్రదించే అవకాశం ఇవ్వకుండా గంటల తరబడి వీడియో కాల్‌లో ఉండేలా స్కెచ్ వేశారు.ఆపై వీడియో కాల్‌లోనే స్కామర్లు ఫేక్ ఆన్‌లైన్ కోర్టు విచారణ చేపట్టారు. జడ్జిగా పరిచయం చేసుకున్న వ్యక్తి వీడియో కాల్‌లో ఎంట్రీ ఇచ్చాడు. మనీల్యాండరింగ్ కేసును విచారించి క్లియర్ చేసేందుకు రూ. 9 లక్షలు తాము చెప్పిన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయాలని బాధితుడిని బెదిరించారు. స్కామర్ల ఒత్తిడి, బెదిరింపులతో బాధితుడు తన ఖాతా నుంచి స్కామర్లకు రూ. 9 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆపై మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# ఎన్ని రోజులు పనిచేస్తే.. మీరు ఐఫోన్ 16 కొనగలరో తెలుసా..?



**న్యూఢిల్లీ- నవభూమి:** ఐఫోన్ ఈ పేరు గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. గ్లోబల్ టెక్ దిగ్గజం ఆపిల్ సంస్థకు చెందిన ఐఫోన్లను కొనుగోలు చేయాలని ప్రతి ఒక్కరూ కలకలు కంటుంటారు. అయితే, ఆ కలలు అందరికీ నెరవేరవు. అందుకు కారణం సాధారణ ఫోన్లతో పోలిస్తే ఐఫోన్ ధరలు చాలా ఎక్కువగా ఉండడమే. ఈ ఫోన్లు దక్కించుకోవాలంటే మన నెల జీతం సరిపోదు. ఐఫోన్లు ప్రతి ఒక్కరి బడ్జెట్‌కు పూర్తిగా సరిపోకపోవచ్చు. కొందరు నెలల తరబడి కష్టపడి పని చేసి వచ్చిన సొమ్మును పొదుపు చేస్తూ.. ఐఫోన్ కొనుక్కుంటుంటారు.

ఇక తాజాగా ఆపిల్ సంస్థ తన తదుపరి మోడల్ ఐఫోన్ 16 సిరీస్‌ను కూడా అందుబాటులోకి తెచ్చేసింది. దీని ధర రూ.70 వేలకు పై మాటే. ఈ నేపథ్యంలో ఓ సంస్థ కీలక అధ్యయనం చేసింది. ఈ ఫోన్ దక్కించుకోవాలంటే ఏ దేశంలోని ప్రజలు ఎన్ని రోజులు పని చేయాలన్న దానిపై పరిశోధన చేసింది. ఐఫోన్ ఇండెక్స్ ఐఫోన్ 16 కొనుగోలు చేయాలంటూ స్విట్జర్లాండ్ ప్రజలు కేవలం నాలుగు రోజులు పనిచేస్తే సరిపోతుంది. ఇక అగ్రరాజ్యం అమెరికాలోని ప్రజలు మాత్రం 5.1 రోజులు పనిచేయాల్సి ఉంటుంది. ఇక ఆస్ట్రేలియన్లు, సింగపూర్ వాసులు 5.7 రోజులు పనిచేస్తే కానీ, ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లను కొనుగోలు చేయలేరు. ఇక భారత్ విషయానికొస్తే కొత్త ఐఫోన్ 16 సిరీస్‌ను సొంతం చేసుకోవాలనుకున్న భారతీయులు ఏకంగా 47.6 రోజులు పనిచేయాలని సదరు అధ్యయనం సూచిస్తోంది. ఐఫోన్ 16 ప్రో (128 జీబీ) ధర ఆధారంగా ఐఫోన్ ఇండెక్స్ ఈ అధ్యయనం చేసింది.

ఆపిల్ తన ఐ-ఫోన్ 16 సిరీస్ ఫోన్లను ఇటీవలే విడుదల చేసిన విషయం తెలిసిందే. ఐఫోన్ 16, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 ప్రో, ఐఫోన్ ప్రో మ్యాక్స్.. అనే నాలుగు మోడళ్లను ఆపిల్ తీసుకొచ్చింది. వీటిల్లో అధునాతన కెమెరా కంట్రోల్ బటన్, యాక్షన్ బటన్ అనే రెండు కొత్త బటన్లను జత చేశారు. అదే విధంగా ప్రత్యేకంగా తయారైన కొత్త చిప్ ఏ18తో వచ్చింది. ఇదిలా ఉండగా.. ఐఫోన్ 16 ప్రారంభ ధర రూ. 79,900గా, ఐఫోన్ 16 ప్లస్ ప్రారంభ ధర రూ. 89,900గా, ఐఫోన్ 16 ప్రో ప్రారంభ ధర రూ. 1,19,900గా, ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్ ప్రారంభం ధర రూ. 1,44,900గా ఉన్నాయి. ఈ ఫోన్లు నేటి నుంచి భారత్‌లో అందుబాటులోకి వచ్చాయి. శుక్రవారం తెల్లవారుజామున నుంచి ముంబైలోని బీకేసీ స్టోర్, న్యూఢిల్లీలోని సాకేత్ సహా భారతదేశంలోని ఆపిల్ రిటైల్, ఆన్‌లైన్ స్టోర్లలో అందుబాటులో ఉన్నాయి.

## ఐఫోన్ ప్రియులకు శుభవార్త.. బ్లింకిట్, బిగ్ బాస్కెట్‌లో యాపిల్ 16 సిరీస్ సేల్స్.. 10 నిమిషాల్లోనే డెలివరీ




**న్యూఢిల్లీ- నవభూమి:** వినియోగదారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న యాపిల్ ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లు భారత్ లో అందుబాటులోకి వచ్చేశాయి. ఈ ఫోన్ అమ్మకాలు శుక్రవారం ఉదయం నుంచే ప్రారంభమయ్యాయి. దీంతో ఐఫోన్ 16 సిరీస్ ఫోన్ల కోసం వినియోగదారులు ఢిల్లీ, ముంబైలోని యాపిల్ రిటైల్ స్టోర్ల ముందు క్యూ కట్టారు. తెల్లవారుజాము నుంచే ఈ ఫోన్‌ను దక్కించుకునేందుకు పడిగాపులు కాస్తున్నారు. దీంతో ఆయా స్టోర్ల వద్ద భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఐఫోన్ ప్రియులకు ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లు శుభవార్త చెప్పాయి. గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా.. పది నిమిషాల్లోనే ఈ ఫోన్లను కస్టమర్ల వద్దకు చేర్చేందుకు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా టాటా యాజమాన్యం ఆధీనంలోని బిగ్ బాస్కెట్ (%దీఅస్త్రమ్ఝంఎవ్%) కేవలం 10 నిమిషాల్లోనే సరికొత్త ఐఫోన్ 16 సిరీస్‌ను డెలివరి చేస్తామని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఎలక్ట్రానిక్ పరికరాల విక్రయ విభాగం క్రోమాతో కలిసి ఎంపిక చేసిన నగరాల్లో ఇవాల్టి నుంచే ఈ సేవలను మొదలు పెట్టింది. ముంబై, ఢిల్లీ - ఎన్‌సీఆర్ ఈ సేవలు మొదలయ్యాయి.

## హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ..

### తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలివే

**హైదరాబాద్-నవభూమి:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరిగింది. భేటీ అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.

హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ ఉండేలా నిబంధనలు సడలించాం. హైడ్రాకు అవసరమైన సిబ్బందిని వివిధ విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై రప్పిస్తున్నాం. 169 మంది అధికారులు, 964 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కేటాయింపుఓఆర్ఆర్ లోపల 27 అర్బన్, లోకల్ బాడీలు ఉన్నాయి. 51 గ్రామ పంచాయతీలను కోర్ అర్బన్‌లో విలీనం.

ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్ ఖరారుకు కమిటీ ఏర్పాటు.

ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో 12 మందితో కమిటీ. కమిటీ కన్వీనర్‌గా ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ.

పోలీసు ఆరోగ్య భద్రత స్కీమ్ ఎస్‌పీఎల్‌కు కూడా వర్తింపు.

మనోహరాబాద్‌లో 72 ఎకరాల్లో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు ఆమోదం.

8 వైద్య కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం. 3వేలకు పైగా పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్.

ఖమ్మం జిల్లాలో 58 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఆమోదం.

ఏటూరునాగారం ఫైర్ స్టేషన్‌కు 34 మంది సిబ్బంది మంజూరు.

కోస్గిలో ఇంజినీరింగ్ కళాశాల, హకీంపేటలో జూనియర్ కళాశాల మంజూరు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు రూ.4,637 కోట్లు మంజూరు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని ఏజెన్సీకి ఆదేశం.

ఈ ఖరీఫ్ నుంచి ఎంఎస్‌పీకి అదనంగా రూ.500 చెల్లించి సన్నాలు కొనుగోలు చేయాలని నిర్ణయం. ఈ ఖరీఫ్‌లో 1.43లక్షల టన్నుల పంట వస్తుందని అంచనా.

అక్టోబరు నుంచి కొత్తగా తెల్ల రేషన్ కార్డుల జారీ. జనవరి నుంచి అన్ని రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం ఇస్తాం.

## అర శాతం వడ్డీరేట్ల కోతపై భిన్నాభిప్రాయాలు

**న్యూఢిల్లీ- నవభూమి:** వడ్డీరేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల మీద ఆ ప్రభావం ఎంతన్నదానిపై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దేశీయ ఎక్స్‌పర్ట్స్ పెట్టుబడులు పెరుగుతాయంటుంటే.. మరికొందరు ఈక్విటీలపై రాబడులు తగ్గుతాయని, బంగారం ధరలు పెరుగవచ్చని అభిప్రాయపడుతున్నారు. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ.. బెంచ్‌మార్క్ రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 4.75-5 శాతంగా నిర్ణయించిన విషయం తెలిసిందే. మునుపు ఇది 5.25-5.50 శాతంగా ఉండేది. గాడి తప్పిన దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించేందుకు వరుసగా 14 నెలలపాటు 20 ఏండ్ల గరిష్ఠ స్థాయిలోనే కీలక వడ్డీరేటును అగ్రరాజ్య సెంట్రల్ బ్యాంక్ ఉంచింది.'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత ఊహించిందే. బంగారం ధరల్లో పెరుగుదలకు, ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులపై లాభాల తరుగుదలకు ఈ నిర్ణయం దారితీయవచ్చు' అని పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు సంజీవ్ అగర్వాల్ అంచనా వేస్తున్నారు.





## రోడ్‌షోతో ఎన్నికల ప్రచారానికి కేజ్రీవాల్ షురూ

**న్యూఢిల్లీ– నవభూమి:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారంనాడు శ్రీకారం చుట్టారు. యమునానగర్‌లోని జగాధరి అసెంబ్లీ నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం 11 జిల్లాల్లో 13 ర్యాలీల్లో కేజ్రీవాల్ పాల్గొనున్నారు. హర్యానాలోని 90 నియోజకవర్గాలకు 'ఆప్' సొంతంగానే పోటీ చేస్తోంది.సీఎం పదవికి రాజీనామా చేసి ప్రజల వద్దకు వెళ్లడం ద్వారా తాను "అగ్నిపరీక్ష'కు సిద్ధమైనట్టు కేజ్రీవాల్ ఇటీవల తన రాజీనామా అనంతరం వ్యాఖ్యానించారు. "నేను అగ్నిపరీక్షకు సిద్ధమయ్యాను. రాముడు 14 ఏళ్ల అరణ్యవాసం ముగించుకున్నప్పుడు సీతమ్మ తల్లి అగ్నిపరీక్షను ఎదుర్కొంది. అలాంటి పరీక్షనే ఇవాళ నేను ఎదుర్కొంటున్నాను. కేజ్రీవాల్ నిజాయితీపరుడు కాదని ప్రజలు అనుకుంటే నాకు ఓటు వేయవద్దు. కానీ నేను నిజాతీపరుడని విశ్వసిస్తేనే ఓటు వేయండి. ఢిల్లీ ప్రజలు తిరిగి ఎన్నుకున్నప్పుడే సీఎం పదవి చేపడతాను" అని కేజ్రీవాల్ తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా డబ్‌వాలీ, రానియా, భివాని, మెహమ్, పుంద్రి, రేవారి, దాద్రి, అస్సాంథ్, బల్లడ్‌గఢ్, బద్ర నియోజకవర్గాల్లో కేజ్రీవాల్ ప్రచారం చేయనున్నారు. కీలక నగరాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రధానంగా స్థానిక అంశాలపై ప్రసంగించనున్నారు. హర్యానాలో కాంగ్రెస్‌తో సీట్ల షేరింగ్ వ్యవహారంలో అవగాహన కుదరకపోవడంతో ఆప్ సొంతంగానే ఎన్నికల బరిలోకి దిగుతోంది.

## సింగపూర్‌లో భారతీయుడికి భారీ జరిమానా.. ఓ స్టోర్ గేటు ముందు ఆ పని చేసినందుకట..?



**న్యూఢిల్లీ–నవభూమి:** సింగపూర్‌లో ఓ భారతీయ నిర్మాణరంగ కార్మికుడికి అక్కడి కోర్టు భారీ జరిమానా విధించింది. మద్యం మత్తులో తాను ఆ తప్పు చేశానని నిందితుడు అంగీకరించడంతో అతడికి రూ.25 వేల ఫైన్ వేసింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సింగపూర్‌లో గత ఏడాది అక్టోబర్ 30న రాత్రి రాము అనే భారత పౌరుడు పూటుగా మద్యం సేవించాడు. ఆ రాత్రంతా మెరీనా బే శాండ్స్ కెసినోలో గడిపాడు.తెల్లవారుజామున 5 గంటలకు కెసినో నుంచి బయటకు వచ్చిన అతను కాలకృత్యాలకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే మద్యం మత్తులో మరుగుదొడ్డి ఎక్కడ ఉందో గుర్తించలేకపోయాడు. చివరకు ఉదయం 7 గంటల సమయంలో అదే ఏరియాలోని 'ది షాపీస్' అనే స్టోర్ ఎంట్రన్స్ వద్ద మల విసర్జన చేశాడు. దాంతో ఈ ఘటనపై విచారణ జరిపిన సింగపూర్ కోర్టు నిందితుడికి భారీ జరిమానా విధించింది.రాము బహిరంగ ప్రదేశంలో మల విసర్జన చేశాడని కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించాడు. తన పని ముగించుకున్నాక అక్కడి నుంచి క్రాంజీలోని తన నివాసానికి వెళ్లాడని తెలిపారు. ఆ తర్వాత సింగపూర్ నుంచి భారత్‌కు వచ్చిన అతడు మళ్లీ జూన్ 4న వెళ్లాడు. మరోసారి అతడు కెసీనోలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా సిబ్బంది గుర్తుపట్టారు. అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.ఈ ఘటనపై విచారణ సందర్భంగా.. నిందితుడికి గరిష్ఠ జరిమానా విధించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. అతడు దాదాపు 10 నిమిషాల పాటు బయటే ఉన్నాడని, ఇది సాధారణ విషయం కాదని అన్నాడు. నిందితుడు మాత్రం తాను మద్యం మత్తులో తప్పు చేశానని, స్వల్ప జరిమానా విధించాలని కోరాడు. దీనిపై న్యాయమూర్తి ఘాటుగా స్పందించారు. 'ఇలాంటి తప్పు పునరావృతమైతే జరిమానా మరింత ఎక్కువ ఉంటుందన్న విషయాన్ని నువ్వు మర్చిపోవద్దు' అని నిందితుడికి గట్టి వార్నింగ్ ఇచ్చారు.


## ఆఖరికి పాకిస్థాన్ దగ్గరా అణ్వస్త్రాలున్నాయ్.. డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ–నవభూమి:** ఈ ప్రపంచానికి అతిపెద్ద ముప్పు అణ్వస్త్రాలని అమెరికా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అందరూ భూతాపం, పర్యావరణం గురించి మాట్లాడుతుంటారని.. తాను మాత్రం ప్రపంచ దేశాల దగ్గర ఉన్న అణ్వాయుధాలే పెను విపత్తుగా భావిస్తానని చెప్పారు. ఆఖరికి పాకిస్థాన్ కూడా అణ్వాయుధాలను అందిపుచ్చుకున్నదని ఆ దేశాని చులకన చేస్తూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

మిషిగావ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ట్రంప్.. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మానవాళికి పెను విపత్తును తెచ్చిపెట్టే అణ్వస్త్రాలపై తానే స్వయంగా నిఘా ఉంచే వాడినని.. ప్రస్తుతం పరిస్థితి మారిపోయిందని అన్నారు. ఇప్పుడు పాకిస్థాన్ కూడా తన అణ్వాయుధాలను పెంచుకునే పరిస్థితికి వచ్చిందని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రపంచ దేశాలు పాకిస్థాన్ దగ్గర ఎన్ని అణ్వాయుధాలు ఉన్నాయనే అంశాన్ని పరిశీలిస్తున్నారు.2023 సెప్టెంబర్ నాటికి పాకిస్థాన్ దగ్గర 170 వరకు అణు వార్ హెడ్స్ ఉన్నాయని తేలింది. ఆ సంఖ్యను 2025 నాటికి 200కి చేర్చడమే లక్ష్యంగా ఆ దేశ అణు శాస్త్రవేత్తలు పని చేస్తున్నారు. వాస్తవానికి పాకిస్థాన్ ఎన్నడూ తన న్యూక్లియర్ ప్రోగ్రామ్ గురించి వాస్తవాలు చెప్పలేదు. అందుకే పాకిస్థాన్ దగ్గర ఎన్ని అణ్వాయుధాలు ఉంటాయన్న విషయంలో నిర్ధారణ లేనప్పటికీ.. ఆ దేశం సిద్ధం చేస్తున్న లాంచ్ పాడ్స్ ఆధారంగా వాటిని లెక్కగట్టినట్లు అమెరికా అణు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.అదేవిధంగా పాకిస్థాన్ దగ్గర అణ్వస్త్రాలను విడుదల చేయడానికి అనువైన యుద్ధ విమానాలు 36 ఉన్నాయని, ఉపరితలం నుంచి లక్ష్యాలను ఛేదించే బాలిస్టిక్ మిసైల్ వ్యవస్థలు ఆరు వరకు ఉన్నాయని న్యూక్లియర్ కాలమ్ తెలిపింది. ఇంకా షార్ట్ రేంజ్ మిసైల్స్ అబ్దాలి, ఘజ్నావి, షాహీన్, నాసర్‌తోపాటు మీడియం రేంజ్ ఘౌరీ, షాహీన్–2 లాంటి వ్యవస్థలు కూడా అందుబాటులో ఉన్నాయి.

## మానవాళి అంతర్ధానం కాకుండా..! 5డీ క్రిస్టల్‌లో మనిషి జన్యువు చేర్పు



**లండన్– నవభూమి:** భూమిపై మానవాళి అంతరించిపోతే? దీనికి సమాధానంగా బ్రిటన్‌లోని సౌతాంప్టన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం.. సైన్స్ ఫిక్షన్‌ను తలపించే ఆవిష్కరణ చేశారు. మనిషి జన్యువులను ఒక '5డీ మెమరీ క్రిస్టల్'లో భద్రంగా దాచిపెట్టారు. అంతరించే జాతిని తిరిగి రప్పించాలన్న సంకల్పంతో.. ఆస్ట్రియాలోని హాల్‌స్టాట్‌లో ఉన్న ఓ గుహలో భద్రంగా ఉంచారు. 360 టెరాబైట్ల మెమరీ కలిగిన ఆ క్రిస్టల్ ఎంత పటిష్టం అంటే.. 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను, గడ్డకట్టే చలిని సైతం తట్టుకుంటుంది.13.8 బిలియన్ సంవత్సరాల వరకు డాటా భద్రంగా ఉంటుంది. ఒకవిధంగా చెప్పాలంటే ఆ క్రిస్టల్ క్వార్ట్‌లా అత్యంత గట్టిదనం కలిగినది. ఈ 5డీ క్రిస్టల్‌లో జన్యువును దాచేందుకు అల్ట్రా ఫాస్ట్ లేజర్లను ఉపయోగించారు. శాస్త్రవేత్తల ఘనతకుగానూ గిన్నిస్ బుక్‌లో చోటు కూడా దక్కింది.5డీ మెమరీ క్రిస్టల్ విశేషాలివీ..

తొలి 5డీ మెమరీ క్రిస్టల్‌ను 2014 జనవరి 23న యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ శాస్త్రవేత్తలు తయారుచేశారు.

గది ఉష్ణోగ్రత వద్ద 300 క్వింట్రిలియన్ సంవత్సరాల వరకు చెక్కు చెదరకుండా ఉంటుంది.

సాధారణంగా దీని జీవిత కాలం 13.8 బిలియన్ సంవత్సరాలు (అంటే.. ప్రస్తుతం మన విశ్వం వయసు అన్నమాట).

## టప్పర్‌వేర్ దివాలా.. ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం



**న్యూయార్క్ – నవభూమి:** ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంక్రప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంక్రప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండి కొట్టాయి.

**80 ఏండ్ల కిందట..**

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.


**పీకల్లోతు అప్పులు**

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కన్సల్టెంట్లూ ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.

భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ అమ్మకాలు యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

## ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో భారత్ మందుగుండు..



**న్యూఢిల్లీ–నవభూమి:** రెండున్నరేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్–రష్యా యుద్ధంలో ఒక్కో దేశం తమ వైఖరి ఏమిటో చెప్పేశాయి. భారత్ మరికొన్ని దేశాలు మాత్రమే తటస్థ వైఖరి అవలంబించాయి. భారత్ అయితే ఇంకో అడుగు ముందుకేసి ఉక్రెయిన్ యుద్ధంలో తమది తటస్థ పక్షం కాదని.. శాంతి పక్షం అని కూడా చెప్పేసింది. జూలైలో ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లడం వివాదం రాజేసినా.. ఆగస్టులో ఉక్రెయిన్ లోనూ పర్యటించి పరిస్థితిని చల్లబరిచారు. కాగా, ఈ నెలలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ రష్యా వెళ్లి మోదీ ఉక్రెయిన్ పర్యటన వివరాలను వెల్లడించారు. అయితే, ఇంతలో మరో వివాదం చుట్టుముట్టింది. ! ఇచ్చింది మనం కాదు ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ కు చెందిన మందుగుండు సామగ్రి వాడుతున్నారంటూ తాజాగా రాయిటర్స్ సంస్థ కథనం ప్రచురించింది. వాటిని శతఘ్ని తూటాలుగా పేర్కొంది. భారత్ కు చెందిన ఆయుధాల తయారీ సంస్థలు అమ్మిన షెల్స్ ను యూరప్ వినియోగదారులు ఉక్రెయిన్ కు మళ్లించారనేది కథనం. దీనిపై రష్యా అభ్యంతరం చెబుతున్నా.. వాణిజ్య కార్యకలాపాలను భారత్ అడ్డుకోవడం లేదని కూడా పేర్కొంది. ఉక్రెయిన్ కు ఏడాదిపైగా ఆయుధాల సరఫరా సాగిందనేది నివేదిక. రాయిటర్స్.. యూరప్, భారత్ ప్రభుత్వాలు, రక్షణ అధికారులతో మాట్లాడిన తర్వాతే తమ కథనం రాస్తున్నామని తెలిపింది. భారత్ ఏమన్నదంటే.. భారత్ తయారీ మందుగుండును రష్యాపై ఉక్రెయన్ వాడుతోందన్న కథనాలను భారత్ గట్టిగా ఖండించింది. ఊహాజనితం, తప్పుదోవ పట్టించే కథనంగా పేర్కొంది. సైనిక, ద్వంద్వ వినియోగ సామగ్రి ఎగుమతుల్లో అంతర్జాతీయ నిబంధనలకు తాము గట్టిగా కట్టుబడి ఉంటామని స్పష్టం చేసింది. ఇప్పటివరకు భారత్ పై వీటి ఉల్లంఘనలకు సంబంధించి ఒక్క ఆరోపణ కూడా రాలేదని తేల్చిచెప్పింది. ఆయుధాల విక్రయంలో అంతర్జాతీయ నిబంధనలను భారత్ ఉల్లంఘించిందనే అవాస్తవాలను ప్రచారం చేసేలా రాయిటర్స్ కథనం ఉందని మండిపడింది. ఉదాహరణలు చెప్పిన జగన్! భారత్ కు చెందిన శతఘ్ని తూటాలను ఉక్రెయిన్ యుద్ధంలో వాడుతోందన్న కథనంలో ఏం ఉందంటే.. "తూటా షెల్స్ లో స్వల్ప మొత్తంలో భారత్ లో తయారైనవి ఉన్నాయి. అధికారులు, రక్షణ రంగ పరిశ్రమ వర్గాలు ఈ విషయం చెప్పాయి. ఉక్రెయిన్ కు భారత్ లో తయారైన పేలుడు పదార్థాలను యూరప్ లోని ఇటలీ,చెక్ రిపబ్లిక్ పంపుతున్నాయి. యూరోపియన్ యూనియన్ కాకుండా యూరప్ లో ఉక్రెయిన్ కు పెద్దఎత్తున ఆయుధ సహకారం ఈ రెండు దేశాలదే" అని పేర్కొంది.

## గాజాలో తగ్గిన యుద్ధ తీవ్రత.. ఇక టార్గెట్ హెజ్బొల్లా!



**జెరుసలేం–నవభూమి:** హెజ్బొల్లాపై పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నది. గత ఏడాదికాలంగా గాజాలో హమాస్‌పై పోరాడుతున్న ఇజ్రాయెల్ ఇప్పుడు హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకున్నది. గాజాలో యుద్ధ తీవ్రత తగ్గడంతో ఇప్పుడు హెజ్బొల్లాకు కేంద్రమైన లెబనాన్ సరిహద్దుకు బలగాలను మోహరిస్తున్నది. గాజాలో జరిగిన పోరులో కీలకంగా వ్యవహరించిన వేలాది మంది సైనికులతో కూడిన 98వ డివిజన్‌ను లెబనాన్ వైపు పంపిస్తున్నది. రెండు రోజులుగా హెజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా పేజర్లు, వాకీటాకీలు, ఇతర పరికరాలు పేలుతున్న ఘటనల వెనుక కూడా ఇజ్రాయెల్ ఉందని హెజ్బొల్లా ఆరోపిస్తున్నది. మరోవైపు 'యుద్ధంలో కొత్త దశ మొదలైంది' అంటూ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యావ్ గాల్లంట్ ప్రకటించారు. హెజ్బొల్లాను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోనున్నదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

**2006 తర్వాత మళ్లీ యుద్ధం?**

గత ఏడాది అక్టోబరు 8 నుంచి హెజ్బొల్లా, ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదాడులు జరుగుతున్నప్పటికీ ఇరుపక్షాలు పూర్తిస్థాయి యుద్ధానికి దిగలేదు. ఏడాదిగా ఇప్పటివరకు ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌లో 500 మందికి పైగా మరణించారు. హెజ్బొల్లా దాడుల్లో 23 మంది ఇజ్రాయెల్ సైనికులు, 26 మంది ప్రజలు మరణించారు. కాగా, 2006లోనూ ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య 34 రోజుల పాటు జరిగిన యుద్ధంలో హెజ్బొల్లా తీవ్రంగా నష్టపోయింది. అయితే, అప్పటి నుంచి హెజ్బొల్లా కూడా యుద్ధ సామర్థ్యాలను పెంచుకుందనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రస్తుతం హెజ్బొల్లా దగ్గర 1,50,000 రాకెట్‌లు, క్షిపణులు ఉన్నాయని, ఇజ్రాయెల్ భూభాగంలో ఏ ప్రాంతంపైనైనా లక్షిత దాడులు చేసే సామర్థ్యమూ హెజ్బొల్లాకు ఉందని యుద్ధ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య యుద్ధం జరిగితే ఇరువైపులా నష్టం భారీగానే ఉండే అవకాశం ఉంది.

**బందీలందరినీ విడుదల చేస్తే యుద్ధం ఆపేస్తాం**

ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య నెలల తరబడి జరుగుతున్న యుద్ధంలో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. అటు ఇజ్రాయెల్ కానీ, ఇటు హమాస్ కానీ ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. ఫలితంగా వేలాదిమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. గాజాస్ట్రిప్ శవాల దిబ్బగా మారుతున్నది. అక్కడి ప్రజలు నిత్యం బిక్కుబిక్కుమంటూ క్షణమొక యుగంగా గడుపుతున్నారు. యుద్ధాన్ని నివారించేందుకు ప్రపంచ దేశాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోగా పరిస్థితులు రోజురోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ తనంత తానే ఓ సరికొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చింది. తమ వద్దనున్న బందీలందరినీ ఒకేసారి విడుదల చేస్తే గాజా స్ట్రిప్‌లో యుద్ధాన్ని విరమిస్తామంటూ హమాస్‌కు ఆఫర్ ఇచ్చింది. అంతేకాదు, ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలందరినీ విడిచిపెట్టడంతోపాటు గాజా స్ట్రిప్ నుంచి తమ మిలటరీని వెనక్కి పిలిపిస్తామని, గాజాలో కొత్త పాలనా వ్యవస్థ ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించింది.

## సీబీఐ పంజా.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక మలుపు



**న్యూఢిల్లీ– నవభూమి:** తెలంగాణలో ప్రభుత్వం మారిన వెంటనే తీవ్ర చర్చనీయాంశం అయిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తాజాగా మరో ఆసక్తి కర పరిణామం చోటు చేసుకుంది. ఓ దశలో గత ప్రభుత్వ పెద్దలు, కీలక వ్యక్తుల మెడకు చుట్టుకునేలా కనిపించిన ఈ ఉదంతంలో మధ్యలో కొన్నాళ్లుగా స్తబ్ధత కనిపించింది. అయితే, అనూహ్యంగా ఓ పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు దొరికిన ఈ అవకాశాన్ని కాంగ్రెస్ సర్కారు చాలా జాగ్రత్తగా వాడుతోంది. ఏ1, ఏ6 ఎక్కడ..? బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి ప్రతిపక్ష నాయకులను అడ్డుకునేందుకు, వారి ఎత్తుగడలను ఎక్కడికక్కడ చిత్తు చేసేందుకు ఫోన్ లను ట్యాప్ చేసిందనే ఆరోపణలున్నాయి. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వచ్చి ఉంటే ఏమయ్యేదో కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పరిస్థితి అంతా మారిపోయింది. ఇక ఈ కేసులో అక్యూజ్డ్ (ఏ–1)గా ప్రభాకర్ రావు, అక్యూజ్డ్ (ఏ–6)గా శ్రవణ్ రావు ఉన్నారు. వీరిద్దరిపై తాజాగా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఇంటర్ పోల్ కు సీబీఐ లేఖ రాసింది. ఈ మేరకు హైదరాబాద్ పోలీసులు చేసిన విజ్ఞప్తిని సీబీఐ అంగీకరించింది. ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులకు త్వరలో రెడ్ కార్నర్ నోటీసులు జారీ కానున్నాయి. అమెరికాలో ఉంటూ.. ట్యాపింగ్ కేసులో మొదటి నిందితుడైన ప్రభాకర్ రావు అమెరికాలో ఉన్నారు. ట్యాపింగ్ కేసు నమోదైన తర్వాత ఈయన అమెరికాకు వెళ్లిపోయారు. పలు అనారోగ్య కారణాలను చూపుతున్నారు. ప్రభాకర్ రావును భారత్ కు రప్పించేందుకు సీఐడీ ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. దీనికోసం ముందుగా ఆయనకు రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేసింది. మరోవైపు ప్రభాకర్ రావుపై నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. ఆయన వర్చువల్ గా విచారణకు హాజరవుతారని కోర్టు దృష్టికి దర్యాప్తు బృందం తీసుకెళ్లింది. ఇక శ్రవణ్ రావు కూడా అమెరికాలోనే ఉన్నారు. రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసిన విషయాన్ని సీబీఐకి సీఐడీ అధికారులు తెలిపారు. సీబీఐ నుంచి ఇంటర్ పోల్‌కి సీఐడీ అధికారులు సమాచారం ఇచ్చారు. ప్రభాకర్ రావును రప్పించేందుకు సీఐడీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఆయన్ను హాజరుపరచాలని ఇప్పటికే నాంపల్లి కోర్టు ఆదేశించింది. ఆరోగ్యం బాగోలేనందున హాజరు కాలేనని సిట్‌కు ప్రభాకర్ రావు తెలిపారు. ఉదాహరణలు చెప్పిన జగన్! ఇంటర్ పోల్ ద్వారా ప్రయత్నం.. సాధారణ ప్రయత్నాల ద్వారా కాకుండా.. ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్ రావును హైదరాబాద్ రప్పించేందుకు సిట్ ప్రయత్నిస్తోంది. అందుకే ఎ–6గా ఉన్న శ్రవణ్ రావు పైన కూడా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేశారు. శ్రవణ్ ఎక్కడ ఉన్నారో తమకు తెలియదని కోర్టుకు సీఐడీ అధికారులు తెలిపారు. త్వరలోనే వీరిద్దరినీ హైదరాబాద్ రప్పిస్తామని సిట్ పేర్కొంటోంది. ప్రభాకర్ రావు విచారణకు హాజరైతే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## వామ్మో.. కిలో బియ్యం రూ.15వేలా..!



**న్యూఢిల్లీ– నవభూమి:** మన దేశంలో వరి ప్రధాన పంట. వరిని పండించే రాష్ట్రాలు చాలా వరకు ఉన్నాయి. వివిధ దేశాల్లోనూ ఈ వరిపంట సాగవుతూ ఉంటుం ది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అన్నమే ఎక్కువగా తింటుంటారు. అయితే.. ఏటా వరిలో రకరకాల వంగడాలు శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తూ ఉంటారు. ఇప్పటికే వరిలో చాలా వంగడాలు ఉన్నాయి. అధిక దిగుబడులు ఇచ్చే వంగడాల కోసం వారి పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి. అలాగే.. మార్కెట్లోకి వెళ్తే రకరకాల బియ్యం చూస్తుంటాం. సన్న, దొడ్డు రకాలు, బాస్మతి అంటూ ఇప్పటికే రకరకాల బియ్యం లభిస్తున్నాయి. ఓ కథ ఉంది ఎక్కువగా మనం తెల్ల బియ్యాన్ని వాడుతుంటాం. అయితే.. మార్కెట్లలో లభిస్తున్న బియ్యం ధర 60 నుంచి 70.. చివరకు కిలో 150 వరకు ధర ఉంటుంది. రకాన్ని బట్టి నాణ్యత, రకాన్ని బట్టి రుచి, వాసన కలిగి ఉంటాయి. అలాగే.. పోషకాలూ మనం పెట్టే ధరను బట్టి ఉంటాయి. వాటి క్వాలిటీని బట్టి మార్కెట్లో అమ్ముతుంటారు. అయితే.. కిలో బియ్యం ధర రూ.15వేలు ఉంటుందని ఎప్పుడైనా విన్నారా..? అవును.. మీరు చదివింది నిజమే.. ఆ బియ్యం ఒక కిలో ధర రూ.15వేలు. ఇంతకీ ఆ బియ్యం ఏంటో ఒకసారి తెలుసుకుందాం. ది ఈ బియ్యం జపనీయులు సాగు చేస్తున్నారు. జపనీస్ కిన్మెమై రైస్ పేరిట వీటిని పండిస్తున్నారు. ఈ బియ్యం కిలో ధర రూ.15వేలకు విక్రయిస్తున్నారు. పేటెంట్ పొందిన కిన్మెమై పద్ధతిని వినియోగించి వీటిని పండిస్తారు. ఇంత ధర పెట్టి కొన్న బియ్యంలో పోషకాలూ అదే స్థాయిలో ఉంటాయట. రుచికూడా చాలా బాగుంటుందని జపనీయులు చెబుతున్నారు. అలాగే.. వీటితో ఏదేని ఆహార పదార్థాలను తయారు చేసి తింటే ఆహారం కూడా బాగుంటుందని అంటున్నారు. జపాన్ ఈ బియ్యం ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేస్తుండగా.. వీటి ధర విన్న ప్రజలు మాత్రం.. ఈ బియ్యం తినాలంటే ఆస్తులను అమ్ముకోవాల్సిందేనని అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది పేదలు కనీసం బయట బియ్యం కొనలేక.. రేషన్ బియ్యం పైనే ఆధారపడి బతుకుతున్నారు. రూ.15వేలకు కిలో ధర విన్నాక ఒకింత ఆశ్యర్యానికి గురవుతున్నారు.

## స్టడీ పర్మిట్లకు కెనడా కోత భారత విద్యార్థులపై ప్రభావం



**ఒట్టావా– నవభూమి:** విదేశీ విద్యార్థుల స్టడీ పర్మిట్లను తగ్గించనున్నట్టు కెనడాప్రకటించింది. 'ఈ ఏడాది 35 శాతం తక్కువగా అంతర్జాతీయ స్టడీ పర్మిట్లను మంజూరు చేస్తున్నాం. వచ్చే ఏడాది ఈ సంఖ్య మరో 10 శాతం తగ్గనుంది. వలస మా ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనకరమే. కానీ కొందరు ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసి విద్యార్థుల ప్రయోజనాన్ని పొందినప్పుడు దాన్ని కట్టడిచేస్తాం' అని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో బుధవారం స్పష్టంచేశారు.

తాత్కాలిక నివాసితుల సంఖ్యను తగ్గించాలని కెనడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది. భారత విద్యార్థులు కెనడాలో ఉన్నత విద్యాభ్యాసానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లను తగ్గించాలన్న ఆ దేశ నిర్ణయం చాలా మంది భారత విద్యార్థులపై ప్రభావం చూపనుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్
శనివారం
21 । సెప్టెంబర్ । 2024

## యాడ్ షూట్‌లో ఓ సూపర్ స్టార్ అభ్యంతరకరంగా తాకాడు : నటి షమ సికిందర్



క్యాస్టింగ్ కౌచ్ సినీ పరిశ్రమలో కలకలం రేపుతుండగా తాజాగా ప్రముఖ టీవీ నటి షమ సికిందర్ సంచలన ఆరోపణలు చేశారు. వాణిజ్య ప్రకటన షూటింగ్‌లో ఓ స్టార్ నటుడు తనను అభ్యంతరకరంగా కౌగిలించుకున్నాడని ఆమె ఆరోపించారు. సన్నివేశం బాగా రావాలనే సాకుతో ఆయన అనూహ్యంగా తనను హగ్ చేసుకున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో అతడితో కలిసి తాను నటించబోనని షమ సికిందర్ స్పష్టం చేశారు.షూటింగ్‌లో భాగంగా సదరు నటుడు తనను హగ్ చేసుకోలేదని, వేరే ఉద్దేశంతోనే అలా చేశాడని వివరించారు. అతడు తనను హగ్ చేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు తాను అసౌకర్యంగా భావించానని చెప్పుకొచ్చారు.

తాను ఎంతోమందితో కలిసి పనిచేశానని, తనకు ఎంతో మంది మగవారితో స్నేహాలు ఉన్నా వారెన్నడూ ఇలా తనను అసౌకర్యానికి గురిచేయలేదని తెలిపారు.

ఆ నటుడు చేసిన పనికి తాను షాక్‌కు గురయ్యానని గుర్తుచేసుకున్నారు. ఆ నటుడు సూపర్ స్టార్ అని, అలాంటి వ్యక్తి ఇంత దిగజారుడుగా ఎందుకు ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు.

నవచిత్ర





## రాయన్ హీరోయిన్ టాలెంట్ తెలిస్తే షాక్ అవుతారు..



ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ అంటే కేవలం గ్లామర్ రోజుకి సొంతం అవ్వడం లేదు. విభిన్నమైన కథతో తమని తాము ప్రూవ్ చేసుకోవడానికి హీరోయిన్లు వెనకాడడం లేదు. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ సృష్టించుకుని.. చీర కట్టు తోటే ఎంతో సాంప్రదాయంగా కనిపిస్తూ అభిమానులను ఫిదా చేస్తోంది ఓ హీరోయిన్. ఇప్పటివరకు ఈ బ్యూటీ నటించిన ప్రతి సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో పాటు ఆమెకు ఉత్తమ నటిగా జాతీయ అవార్డు కూడా దక్కింది. ఇంతకీ ఆ బ్యూటీ ఎవరో తెలుసా? ప్రస్తుతం సౌత్ సినీ ఇండస్ట్రీలో కుర్రకారును ఫిదా చేస్తూ దూసుకుపోతున్న ఆ బ్యూటీ మరెవరో కాదు అపర్ణ బాలమురళి. సడన్‌గా ఈ పేరు చెప్తే గుర్తు రాని వారికి ధనుష్ రాయన్ మూవీలో ' పంజు మిఠాయి 'డాన్స్ చేసిన హీరోయిన్ అంటే టక్కున గుర్తుకొస్తుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పాట తెగ వైరల్ అవుతుంది. సన్నగా ఉంటేనే హీరోయిన్స్ అన్నమాటను చెరిపేస్తూ బొదుగా ఉన్న బ్యూటిఫుల్ గా ఉంటారు అని ప్రూవ్ చేసే అపర్ణ ఈ సాంగ్లో బాగా పాపులర్ అయింది.అందుకే ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో ఈ బ్యూటీ కి చాలా స్పెషల్ అట్రాక్షన్ ఏర్పడింది. కేవలం గ్లామర్ రోజుకి పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ.. అద్భుతమైన అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కోలీవుడ్ ఇండస్ట్రీలో మెల్లిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఏర్పాటు చేసుకుంటున్న ఈ ముద్దుగుమ్మ మలయాళం లో మహేష్ పగ మూవీతో ఎంట్రీ ఇచ్చింది. కోలీవుడ్ హీరో సూర్యతో కలిసి ఆమె నటించిన సూపర్ హిట్ చిత్రం సురారై పోట్రు కు గానూ అపర్ణ ఉత్తమ నటిగా జాతీయ అవార్డు అందుకుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో అపర్ణకు సంబంధించిన ఓ చిన్ననాటి ఫోటో వైరల్ అయింది. అపర్ణ తండ్రి బాలమురళి సంగీత విద్యాంసుడు కావడంతో ఆమెకు నటనతో పాటు సంగీతంలో కూడా ప్రావీణ్యత ఉంది. సండే హాలిడే అనే మూవీతో ఆమె గాయనిగా కూడా పరిచయం అవ్వడం విశేషం. ప్రస్తుతం తమిళ్ తో పాటు మలయాళంలో వరుస క్రేజీ ఆఫర్స్ తో ఈ బ్యూటీ ఫుల్ బిజీగా ఉంది.

## ముంబైలో కొత్త సంసారం మొదలు..!



కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్ లోనూ హీరోగా నటించి మెప్పించిన సిద్దార్థ్ ఇటీవల అదితి రావు హైదరి ని వివాహం చేసుకున్న విషయం తెల్సిందే. వీరిద్దరికీ శర్వానంద్ హీరోగా నటించిన 'మహా సముద్రం' సినిమా షూటింగ్ సమయంలో పరిచయం అయింది. ఆ సినిమా తర్వాత కూడా ఇద్దరి మధ్య స్నేహం కంటిన్యూ అయింది. ఆ స్నేహం ప్రేమగా మారింది, చాలా కాలం పాటు ఇద్దరు సహ జీవనం సాగించారు. ఇద్దరికీ అంతకు ముందే వివాహం అవ్వడం జరిగింది. కొన్ని కారణాల వల్ల విడిపోయారు. ఇప్పుడు ఇద్దరూ సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించి పెళ్లి పీటలు ఎక్కారు. అందాల బుట్టబొమ్మ గ్లామర్ హొయలు ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి లో ఒక పురాతన ఆలయంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తర్వాత ఈ కొత్త జంట కొత్త సంసారం ఎక్కడ మొదలు పెట్టబోతున్నారు అనే ఆసక్తి అందరిలో వ్యక్తం అవుతోంది. చెన్నైలో సిద్దార్థ్ కి ఇల్లు ఉంది. కానీ ఈ కొత్త జంట ముంబైలో ఉండాలని భావిస్తున్నారట. ఇప్పటికే అదితి ఉంటున్న ఇంట్లో కొత్త సంసారంను మొదలు పెట్టారని తెలుస్తోంది. ఇటీవలే ముంబై వెళ్లిన కొత్త జంట ఎయిర్ పోర్ట్ లో మీడియా కంట పడ్డారు. ఆ సమయంలో మీడియా వారు వారిని ఫోటోలు తీసేందుకు పరుగులు పెట్టారట. ప్రస్తుతానికి అదితి రావు హైదరి ఇంట్లోనే ఉంటున్నారు. త్వరలోనే ముంబైలో ఒక ఖరీదైన ఇల్లును కొనుగోలు చేయాలని సిద్దార్థ్ ప్లాన్ చేస్తున్నాడట. అందుకు సంబంధించిన చర్చలు సైతం జరుగుతున్నాయని తెలుస్తోంది. తమిళ్, తెలుగు సినిమాల్లో నటిస్తూ ఉన్నప్పటికీ సిద్దార్థ్ ముంబైలో ఉండాలని నిర్ణయించుకున్నట్లుగా సమాచారం అందుతోంది. ముంబై లో సినీ సెలబ్రిటీలు ఉంటున్న ఏరియాలోనే ఇప్పుడు ఈ స్టార్ కపుల్ కొత్త ఇంటిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇద్దరూ ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తూ ఉన్న కారణంగా బాగానే సంపాదన ఉన్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్ తో పాటు సౌత్ లోనూ హీరోయిన్ గా అదితి రావు హైదరి సినిమాలు చేసిన విషయం తెల్సిందే. ప్రస్తుతం అదితి హిందీలో ఒక వెబ్ సిరీస్‌లో నటించడంతో పాటు ఒక తమిళ సినిమాలోనూ నటిస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్‌గా అదితి రావు హీరోగా సిద్దార్థ్ కలిసి ఒక సినిమా చేసే అవకాశాలు ఉన్నాయి. ఒక తమిళ దర్శకుడు ఈ విషయమై వారితో చర్చలు జరిపాడని సమాచారం అందుతోంది. ఒక మంచి ఫీల్ గుడ్ కథ తో వస్తే తప్పకుండా చేద్దాం అని హామీ ఇచ్చాడట. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా సినిమా కథ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. కొత్త జీవితం ప్రారంభించిన వీరు ఎప్పుడూ సంతోషంగా కలిసి ఉండాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

## ఫెయిల్యూర్స్ ఎఫెక్ట్.. రామ్-హరీష్ శంకర్ సినిమా ఇక లేనట్టేనా..?



ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్నాడని తెలిసిందే. ఇటీవలే భారీ అంచనాల మధ్య విడుదలైన డబుల్ ఇస్మార్ట్ బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయింది. మరోవైపు ఇటీవలే మిస్టర్ బచ్చన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చి భారీ డిజాస్టర్‌ను ఖాతాలో వేసుకున్నాడు దర్శకుడు హరీష్ శంకర్.మిస్టర్ బచ్చన్ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద ఊహించని విధంగా ఫెయిల్యూర్‌గా నిలిచింది. కాగా ఈ ఇద్దరి కాంబోలో సినిమా రాబోతుందంటూ ఇప్పటికే కొన్నాళ్లుగా నెట్టింట పుకార్లు షికారు చేస్తున్నాయని తెలిసిందే. మరోవైపు మహేశ్ బాబు పీ డైరెక్షన్‌లో రామ్ సినిమా చేయబోతున్నాడని కొత్త అప్‌డేట్ కూడా వచ్చేసింది. మరి హరీష్ శంకర్‌తో సినిమా సంగతేంటనే దానిపై తాజాగా మరో వార్త తెరపైకి వచ్చింది.ఫిలిం నగర్ సర్కిల్ తాజా కథనాల ప్రకారం రామ్-హరీష్ శంకర్ ప్రాజెక్ట్ అటకెక్కినట్టేనని ఇన్‌సైడ్ టాక్. ప్రస్తుతానికి హరీష్‌శంకర్‌తో సినిమా చేసేందుకు రామ్ సిద్ధంగా లేడట. ఈ లెక్కన వీరి కాంబోలో సినిమా రావడం ఇప్పట్లో లేనట్టేనని అర్థమవుతోంది. హరీష్ శంకర్ ప్రస్తుతం పవన్ కల్యాణ్‌తో చేస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్‌పైనే పూర్తి ఫోకస్ పెట్టడబోతున్నాడట.మరి భవిష్యత్‌లోనైనా రామ్-హరీష్ సినిమా ఉంటుందేమోనన్నది చూడాలి. రామ్ నెక్స్ట్ మూవీ టాలీవుడ్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో రానుందని తెలుస్తోండగా.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## శ్రీవారి లడ్డు వివాదంపై స్పందించిన పవన్ హీరోయిన్



ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వార్త ఏదైనా ఉంది అంటే అది తిరుపతి లడ్డు వివాదం అని చెప్పకతప్పదు. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో స్వచ్ఛమైన నెయ్యికి బదులు జంతువుల నూనెలను వాడారని వచ్చిన నివేదికలు భక్తుల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. పవిత్రమైన తిరుపతి శ్రీవారి లడ్డూను కల్తీ చేయడంతో మహా పాపానికి పాల్పడిన నీచులను శిక్షించాలని భక్తులతో పాటు నెటిజన్లు ఏపీ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే ఈ ఘటనపై పవన్ నటించిన అత్తారింటికి దారేది హీరోయిన్ ప్రణీత సుభాష్ కూడా తాజాగా ఎక్స్ వేదికగా స్పందించింది.

శ్రీవారి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వులు వినియోగిస్తున్నారనే వార్తలు వస్తుండటం చాలా భాదాకరం. శ్రీవారి విషయంలో ఇలా జరగడం ఎంతో దారుణంగా ఉంది. ఇలాంటి పని చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఇది శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులకు నిజంగా కలలో కూడా ఊహించలేని పరిణామం అంటూ ప్రణీత సుభాష్ రాసుకోచ్చింది.మరోవైపు ఈ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. ఈ ఘటనపై తీవ్రంగా విచారం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆలయాల్లో జరిగే అంశాల పర్యవేక్షణకు జాతీయస్థాయిలో సనాతన ధర్మరక్షణ బోర్డు ఏర్పాటు చేయాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయపడ్డారు. సనాతన ధర్మానికి ఏ రూపంలో ముప్పు వచ్చినా మనమంతా కలిసి నిర్మూలించాలని పిలుపునిచ్చారు.

## అక్టోబర్ 27న విజయ్ దళపతి పార్టీ తొలి సమావేశం.. అదే రోజున పార్టీ సింబల్ ఆవిష్కరణ..!



ప్రముఖ కోలీవుడ్ నటుడు దళపతి విజయ్ రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉన్న నటుడు.. త్వరలోనే షూటింగ్స్‌ని పూర్తి చేసి పూర్తిగా రాజకీయాల్లోకి రానున్నారు. ఈ క్రమంలో ఆయన పార్టీకి సంబంధించి తొలి సమావేశం, పార్టీ సింబల్‌కు సంబంధించిన వివరాలపై కీలక ప్రకటన చేశారు. పార్టీ తొలి రాష్ట్ర సదస్సు అక్టోబర్ 27న విల్లుపురం జిల్లాలో నిర్వహించనున్నట్లు తమిళగ వెట్రి కళగం దళపతి విజయ్ తెలిపారు. అదే సమావేశంలో పార్టీ గుర్తును సైతం ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని సలై గ్రామంలో సదస్సు జరుగుతుందని విజయ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆ రోజున పార్టీ కార్యాచరణ ప్రణాళిక సైతం వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. విజయ్ ఫిబ్రవరిలో రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం విధితమే, ఇటీవల ఎన్నికల సంఘం వద్ద పార్టీని పేరును నమోదు చేశారు. ఈ నెల 17న ద్రవిడ ఉద్యమ ప్రముఖుడు పెరియార్ ఈవీ రామస్వామికి విజయ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎంకే పార్టీ వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురైపై ప్రశంసలు కురిపించారు. తమిళగ వెట్రి కళగం ద్రవిడ భావజాలానికి కట్టుబడి విజయ్ పేర్కొన్నారు.

## ద్రవిడ్‌కు తోడుగా అతడు.. మళ్లీ హిట్ కొడుతారా..?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత పురుషుల జట్టు మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్ ఐపీఎల్‌లో తన మార్క్ చూపించనున్నాడు. ఇప్పుడు కూడా అతడు కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో కలిసి పనిచేయనున్నాడు. అవును.. రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్‌గా విక్రమ్ రాథోర్ నియమితులయ్యాడు. టీమిండియాకు టీ20 ట్రోఫీకి అందించిన ఈ ఇద్దరూ ఫ్రాంచైజీ క్రికెట్‌లో హిట్ కొట్టేందుకు సిద్ధమయ్యారు.

ఈ విషయాన్ని శుక్రవారం రాజస్థాన్ ఫ్రాంచైజీ వెల్లడించింది. ఈమధ్యే ద్రవిడ్‌ను తమ జట్టుకు హెడ్‌కోచ్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. రాజస్థాన్ బ్యాటింగ్ కోచ్‌గా విక్రమ్ నియామకం పట్ల ద్రవిడ్ సంతోషం వ్యక్తం చేశాడు. 'చాలా ఏడ్లుగా విక్రమ్‌తో కలిసి పని చేశాను. అతడి సాంకేతిక అనుభవం, ప్రశాంతంగా ఉండే తీరు, భారత పరిస్థితులపై అతడికి ఉన్నఅవగాహన రాజస్థాన్ రాయల్స్‌కు ఎంతో పనికొస్తాయని నమ్మకంగా చెబుతున్నా. కోచింగ్ బృందంగా ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఉంది. ఇద్దరం కలిసి టీమిండియా విజయాల్లో భాగమయ్యాం. మరోసారి విక్రమ్‌తో పనిచేసే అవకాశం దక్కినందుకు థ్రిల్‌గా ఫీలవుతున్నా. యువ ఆటగాళ్లకు తర్ఫీదు ఇవ్వడంలో అతడు ఎక్స్‌పర్ట్' అని ద్రవిడ్ తెలిపాడు.

## ఒక్కటిన్నర సెషన్‌లోనే బంగ్లాదేశ్ ఆలౌట్.. భారత్‌కు భారీ ఆధిక్యం




**న్యూఢిల్లీ-నవభూమి:**ఒక్కటిన్నర సెషన్‌లోనే బంగ్లాదేశ్ ఆలౌట్.. భారత్‌కు భారీ ఆధిక్యం. చెపాక్ స్టేడియంలో భారత బౌలర్ల ధాటికి బంగ్లాదేశ్ విలవిలలాడింది. టీమిండియా పేసర్ల విజృంభణకు నిలువలేక ఒకటిన్నర సెషన్‌లోనే చాప చుట్టేసింది. జస్ప్రీత్ బుమ్రా(4/50), మహ్మద్ సిరాజ్(2/30) బుల్లెట్ బంతులను ఎదుర్కోలేక 149 పరుగులకు ఆలౌటయ్యింది. దాంతో, టీమిండియాకు 227 పరుగుల ఆధిక్యం లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో రోహిత్ సేన 376 పరుగులు కొట్టిన విషయం తెలిసిందే.పాకిస్థాన్‌పై టెస్టు సిరీస్ విజయంతో భారత్‌కు వచ్చిన బంగ్లాదేశ్ బ్యాటర్లు తొలి మ్యాచ్‌లోనే తడబడ్డారు. బుమ్రా(4/50), ఆకాశ్ దీప్(2/19)ల పేస్‌ను ఎదుర్కోలేక నానా తంటాలు పడ్డారు. బంగ్లా జట్టులో ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ 32 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. టెయిలెండర్ నహిద్ రానా(11)ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో 149 వద్ద బంగ్లా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

నవక్రీడ

## చెలరేగిన భారత బౌలర్లు.. తల్లడిల్లిన బంగ్లా బ్యాటర్లు




**చెన్నై-నవభూమి:** భారత బౌలర్లు చెలరేగిపోతున్నారు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో.. రెచ్చిపోయారు. బంగ్లా టాప్ ఆర్డర్‌ను ఈజీగా పెవిలియన్‌కు పంపించేశారు. బుమ్రా, ఆకాశ్, జడేజా, సిరాజ్‌లు వరుసగా వికెట్లు తీశారు. దీంతో బంగ్లా తన తొలి ఇన్నింగ్స్‌లో.. 37 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 112 రన్స్ మాత్రమే చేసింది. రెండో రోజు బంగ్లా బ్యాటర్లలో షకీబ్, లింటన్ దాస్‌లు కాస్త పోరాడారు. ఆ ఇద్దరి మధ్య 50 రన్స్ భాగస్వామ్యం ఏర్పడింది. అయితే కొంత డేరింగ్ షాట్లకు వెళ్లిన లింటన్ తన వికెట్‌ను సమర్పించుకున్నాడు. ప్రస్తుతం 264 పరుగులు వెనుకబడి ఉంది బంగ్లాదేశ్. రెండో రోజు ఆటలో ఇంకా మూడవ సెషన్ మిగిలి ఉన్నది. భారత తన తొలి ఇన్నింగ్స్‌లో 376 రన్స్ కు ఆలౌటైంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**